

# విభారె
## తెలుగు దినపత్రిక
## VIBHARE TELUGU DAILY

ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం | స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము | ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
అధ్యక్షులు ఆవుల విజయభాస్కర రెడ్డి అడ్వకేట్ B.A.LL.B
ఆళ్లగడ్డ
9440232308,9494498787

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం 03 జులై 2021 సంపుటి : 02 సంచిక :342 పేజీలు : 4 వెల : రూ 3-00

# గాలి కాలుష్యం ఎక్కువగా ఉండే రాష్ట్రాల్లో కోవిడ్ సోకే అవకాశం అధికం!



న్యూఢిల్లీ : కలుషిత గాలిని పీల్చేవారికి కోవిడ్-19 సోకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తాజా అధ్యయనం వెల్లడించింది. పీఎం 2.5 కణాలు గాలిలో అధికంగా ఉంటే, వాటిని పీల్చేవారి శరీరంలోకి సులువుగా చేరిపోతాయని, ఫలితంగా ఊపిరితిత్తులు, శ్వాస నాళాలలో మంట పుడుతుందని పేర్కొంది. దీనివల్ల రోగ నిరోధక శక్తి బలహీనపడటంతోపాటు, గుండె, రక్తనాళాలు, ఊపిరితిత్తుల సమస్యలు ఏర్పడే ప్రమాదం ఉంటుందని వివరించిందిభువనేశ్వర్‌లోని ఉత్కళ్ విశ్వవిద్యాలయం, పుణేలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటియరాలజీ, రూర్కేలాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, భువనేశ్వర్‌లోని ఐఐటీ ఈ అధ్యయనాన్ని నిర్వహించాయి. గత ఏడాది నవంబరు 5 వరకు ఉద్గారాలకు సంబంధించిన సమాచారం, గాలి నాణ్యత, కోవిడ్-19 కేసులు, వాటివల్ల సంభవించిన మరణాలకు సంబంధించిన సమాచారాన్ని అధ్యయనం చేశారు. గాలి నాణ్యత, వాతావరణ సూచన, పరిశోధన వ్యవస్థ (సఫర్) డైరెక్టర్, ఈ అధ్యయన నివేదిక రూపకర్తల్లో ఒకరు అయిన గుఫ్రాన్ బేగ్ మాట్లాడుతూ, ఈ అధ్యయనాన్ని దేశవ్యాప్తంగా 721 జిల్లాల్లో నిర్వహించినట్లు తెలిపారు. వాతావరణంలోకి పీఎం2.5 ఉద్గారాలు వెలువడటానికి, కోవిడ్-19 ఇన్ఫెక్షన్లకు, వాటి వల్ల సంభవించే మరణాలకు సంబంధం ఉన్నట్లు వెల్లడైందని తెలిపారు. పీఎం 2.5 ఉద్గారాలు, కోవిడ్-19 కేసుల మధ్య సంబంధం ఎక్కువగా ఉన్నట్లు వెల్లడైందని, అయితే ఇది నూటికి నూరు శాతం కాదని వివరించారు. ఇటువంటి సందర్భాల్లో కొన్ని ఆశ్చర్యకరమైన అంశాలు కూడా కనిపించాయన్నారు. టెస్టింగ్‌పై కూడా ఈ సంబంధం ఆధారపడుతుందన్నారు. కాలుష్య కాసారాలు ఉన్న నగరాల్లో కోవిడ్-19 సోకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెప్పడానికి తగిన ఆచరణాత్మక సాక్ష్యాధారాలు ఈ అధ్యయనంలో లభించాయి. భారత దేశానికి సంబంధించిన ఇటువంటి ఆధారాలు లభించడం ఇదే తొలిసారి. ఖనిజ ఇంధనాలను వినియోగించడం వల్ల వెలువడే ఉద్గారాల వల్ల గాలి కలుషితమవుతున్నట్లు, ఇటువంటి కాలుష్య కేంద్రాలు ఉన్న నగరాల్లో కోవిడ్-19 సంక్రమించే అవకాశాలు అధికంగా ఉన్నట్లు పేర్కొంది. ఢిల్లీ, మహారాష్ట్ర, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తర ప్రదేశ్, ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణా, గుజరాత్, బిహార్, కర్ణాటక, ఒడిశా, మధ్య ప్రదేశ్ రాష్ట్రాల్లో సుదీర్ఘకాలం అత్యధిక పీఎం2.5 కణాలకు ప్రజలు గురవుతున్నట్లు, కోవిడ్-19 కేసులు అధికంగా ఉన్నట్లు ఈ అధ్యయనం పేర్కొంది.కోవిడ్-19 సోకే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు పేర్కొంది. గాలి నాణ్యత దయనీయంగా ఉండటానికి, కోవిడ్ మృతుల సంఖ్యకు స్పష్టమైన సంబంధం ఉన్నట్లు తెలిపింది. గాలి నాణ్యత నాసిరకంగా ఉన్న రోజుల సంఖ్య సంవత్సరంలో 100కు మించితే మరణాల సంఖ్య బాగా పెరిగినట్లు పేర్కొంది. ఢిల్లీలో నాసిరకం గాలి ఉన్న రోజులు సంవత్సరానికి 288 కాగా, గత ఏడాది నవంబరు 5 వరకు 4,38,529 కోవిడ్ కేసులు నమోదయ్యాయని, 6,989 మంది కోవిడ్ బాధితులు మరణించారని తెలిపింది.

# 'దిశ పనితీరుపై ప్రతీ పీఎస్‌లో డిస్‌ప్లే ఏర్పాటు చేయండి: సీఎం జగన్



అమరావతి: 'దిశవ ప్రాజెక్ట్‌పై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. సమావేశానికి హోంమంత్రి సుచరిత, డీజీపీ గౌతమ్ సవాంగ్, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. cc గ్రామ, వార్డు సచివాలయాల్లో మహిళా పోలీసులను యాక్టివ్‌గా చేయాలి. ఫిర్యాదు చేయడానికి మహిళలు పీఎస్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా చేయాలి. గ్రామ, వార్డు సచివాలయాల్లోని మహిళా పోలీసులకే ఫిర్యాదు చేసేలా చూడాలి. జీరో ఎఫ్ఐఆర్ అవకాశాన్ని విస్తృతంగా కల్పించాలి. దిశ యాప్‌పై మహిళా పోలీసులకు అవగాహన, శిక్షణ కల్పించాలి. ప్రతి 2 వారాలకోసారి కలెక్టర్, ఎస్పీలు ప్రజా సమస్యలతో పాటు.. మహిళల భద్రతపైనా సమీక్ష నిర్వహించాలి. పోలీస్ స్టేషన్లలో రిసెప్షన్ వ్యవస్థ పటిష్టంగా ఉండాలి. దిశ ఎలా పనిచేస్తుందన్న దానిపై ప్రతి పీఎస్‌లో డిస్‌ప్లే ఏర్పాటు చేయాలిcc అని తెలిపారు. గంజాయి రవాణా, సరఫరాపై ఉక్కుపాదం మోపాలని సీఎం జగన్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం, పోలీసులపై దుష్ప్రచారం చేస్తున్న ఘటనల్లో నిజాలను ప్రజల ముందుంచాలన్నారు. బాధితులను ఆదుకునే విషయంలో ఆలస్యం జరగకూడదని తెలిపారు.

## తేజస్వినిని వెంకటేశ్ హత్య చేశాడు: డీఎస్పీ

### డీఎస్పీ రాజ్‌గోపాల్ రెడ్డి



నెల్లూరు: గూడూరులో సంచలనం సృష్టించిన తేజస్విని మృతి వెనుక ఉన్న మిస్టరీని పోలీసులు ఛేదించారు. తేజస్వినిని వెంకటేష్ హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ సందర్భంగా డీఎస్పీ రాజ్‌గోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ccతేజస్వినిని వెంకటేష్ హత్య చేశాడు. తేజస్విని మెడపై కత్తితో పొడిచి, టవల్‌తో గొంతు నులిమి చంపాడు. తర్వాత ఫ్యాన్‌కు ఉరేసుకుని వెంకటేష్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గతంలో వీరిద్దరి మధ్య ప్రేమ వ్యవహారం నడిచింది. కొంతకాలంగా తేజస్విని.. వెంకటేష్‌కు దూరంగా ఉంటుంది, అయితే హత్య వెనుక మరెవరి ప్రమేయం ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నాంవవడీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. వెంకటేష్‌పై హత్య కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.



బాధితులను పరామర్శించిన వాసిరెడ్డి పద్మ

ఇదిలాఉంటే తేజస్విని కుటుంబసభ్యులను మహిళా కమిషన్ చైర్మన్ వాసిరెడ్డి పద్మ శుక్రవారం పరామర్శించారు. cఇలాంటి ఘటనలను సమాజం తీవ్రంగా పరిగణించాలి. ప్రేమ పేరుతో అమాయకుల ప్రాణాలు తీస్తున్నారు. ప్రేమోన్మాది వెంకటేష్‌పై కఠినచర్యలు తీసుకోవాలిc అని ఆమె పేర్కొన్నారు

# కొత్త సాగు చట్టాలపై శరద్ పవార్ వైఖరిని స్వాగతించిన కేంద్ర మంత్రి



న్యూఢిల్లీ : కొత్త సాగు చట్టాలపై ఎన్‌సీపీ చీఫ్ శరద్ పవార్ వ్యాఖ్యలను స్వాగతిస్తున్నట్లు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ చెప్పారు. ఈ చట్టాలను పూర్తిగా తిరస్కరించరాదని, కేవలం సమస్యాత్మక భాగాలను మాత్రమే సవరించవచ్చునని పవార్ చెప్పారని, ప్రభుత్వ వైఖరి కూడా ఇదేనని తెలిపారు. ఈ ఆలోచనా విధానంతోనే ప్రభుత్వం రైతులతో చర్చిస్తోందని తెలిపారు. శుక్రవారం తోమర్ ఓ వార్తా సంస్థతో మాట్లాడారు. ఎన్‌సీపీ చీఫ్, కేంద్ర వ్యవసాయ శాఖ మాజీ మంత్రి శరద్ పవార్ గురువారం ముంబైలోని ఓ ప్రైవేటు విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త సాగు చట్టాల్లో కొన్ని సవరణలు చేయవలసిన అవసరం ఉందన్నారు. వాటిని పూర్తిగా తిరస్కరించవలసిన అవసరం లేదన్నారు. చట్టాలను పూర్తిగా రద్దు చేయడానికి బదులు రైతులకు సమస్యలు సృష్టిస్తున్న వివాదాస్పద భాగాలను సవరించవచ్చునని తెలిపారు. ఈ చట్టాలపై ఓ నిర్ణయానికి రావడానికి ముందు వాటిపై వివరంగా అధ్యయనం చేయాలన్నారు. శరద్ పవార్ వ్యాఖ్యలపై భారతీయ కిసాన్ యూనియన్ నేత రాకేశ్ తికాయత్ స్పందిస్తూ, కొత్త సాగు చట్టాల్లో సవరణలకు తాము అంగీకరించబోమని తెలిపారు.

## కేఆర్ఎంబీ చెప్పినా తెలంగాణ వినడం లేదు: సజ్జల



అమరావతి: జల వివాదం విషయంలో కేఆర్ఎంబీ చెప్పినా తెలంగాణ వినడం లేదని అందుకే సీఎం వైఎస్ జగన్ లేఖ రాయాల్సి వచ్చిందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సమన్వయను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని సీఎం జగన్ ప్రయత్నిస్తున్నారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సీఎం జగన్ సహకరించారని గుర్తు చేశారు. గతంలో ఇరు రాష్ట్రాల సీఎంల సమావేశంలో రాయలసీమ ప్రయోజనాలు అవసరమని కేసీఆరే అన్నారని పేర్కొన్నారు. ఇప్పుడు ఎందుకు పరిస్థితులు మారాయో అర్థంకావడం లేదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి చేస్తోందని, దీనివల్ల ఏపీకి తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

# కత్తి మహేశ్ చికిత్సకు ఏపీ ప్రభుత్వం భారీ ఆర్థిక సాయం



అమరావతి: ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన నటుడు, సినీ విశ్లేషకుడు కత్తి మహేశ్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. గత నెల 26న నెల్లూరు జిల్లా కొడవలూరు వద్ద కారు డ్రైవ్ చేస్తూ కత్తి మహేశ్ ప్రమాదానికి గురైన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. దీంతో ఆయన్ను చికిత్స కోసం చెన్నైలోని అపోలో ఆస్పత్రికి తరలించారు. తలకు బలమైన గాయాలు కావడంతో వైద్యులు ఆయనకు శస్త్ర చికిత్స చేయాల్సి వచ్చింది. ప్రస్తుతం మహేశ్ ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో మహేశ్ చికిత్స నిమిత్తం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భారీ ఆర్థికసాయం ప్రకటించింది. ఈ క్రమంలోనే సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.17లక్షలను చెన్నై అపోలో ఆస్పత్రి ఖాతాలో జమ చేసింది.

## చెల్లికే న్యాయం చేయలేని సీఎం రాష్ట్రానికి అవసరమా: అనిత

అమరావతి: మహిళలను కాపాడటం చేతకాకుంటే సీఎం జగన్ తక్షణమే పదవికి రాజీనామాచేయాలని టీడీపీ మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత డిమాండ్ చేశారు. ఆడబిడ్డలను కాపాడలేని సీఎం రాష్ట్రానికి అవసరమా? అని ఆమె వ్యాఖ్యానించారు. పోలీసులు కూడా

ఈ అసమర్థ సీఎం పాలనలో విధినిర్వహణ మరిచారా? అని ప్రశ్నించారు. దిశ యాప్ పేరుతో హడావుడి తప్ప ఏం చేస్తున్నారని మండిపడ్డారు. ఢిల్లీ వెళ్లి కేసుల గురించి మాట్లాడుకోవడం తప్ప ఆడబిడ్డల రక్షణకోసం తెచ్చిన చట్టాన్నిఆమోదించమని కోరారా అని ప్రశ్నించారు. సొంత చెల్లికి న్యాయం చేయలేని సీఎం, రాష్ట్ర ఆడబిడ్డలను రక్షిస్తారా అని వంగలపూడి అనిత ఆగ్రహం వ్యక్తం చేశారు.

# గుంటూరు యువతి అరుదైన ఘనత

### అంతరిక్షంలోకి అడుగుపెట్టబోతున్న తెలుగు యువతి
### 'వర్జిన్ గెలాక్టికవ వ్యోమనౌ
### కలో శిరీష బండ్ల





హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరుకు చెందిన శిరీష బండ్ల అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. అంతరిక్ష వాణిజ్య యాత్రల కోసం బ్రాన్సన్ సంస్థ సిద్ధం చేసిన' వర్జిన్ గెలాక్టిక్ యూనిటీవ అనే ప్రత్యేక వ్యోమనౌక ద్వారా అంతరిక్షంలో అడుగుపెట్టేందుకు సిద్ధమవుతోంది. కల్పనా చావ్లా, ఇండియన్ అమెరికన్ సునీతా విలియమ్స్ తరువాత అంతరిక్షంలోకి అడుగుపెట్టబోతున్న భారతీయ సంతతి మహిళల సరసన చేరారు. అలాగే ఈ ఘనత సాధించిన తొలి తెలుగు తేజం. రెండవ భారతీయ మహిళ, నాల్గవ భారతీయురాలు కూడా. అమెరికాకు చెందిన ప్రముఖ ప్రైవేట్ అంతరిక్షయాన సంస్థ వర్జిన్ గెలాక్టిక్ ఈ వ్యోమనౌకను నింగిలోకి పంపనుంది. ఇందులో సంస్థ అధిపతి సర్ రిచర్డ్ బ్రాన్సన్‌తోపాటు ఐదుగురు ప్రయాణికులు ఉంటారు. వీరిలో సంస్థ ఉపాధ్యక్షురాలు, తెలుగు యువతి శిరీ కూడా చోటు సంపాదించుకోవడం విశేషంగా నిలిచింది. రిచర్డ్ బ్రాన్సన్‌తో కలిసి హాబ్‌నాబ్ చేయటం! గర్వించదగ్గ విషయమంటూ శిరీష బంధువు రామారావు కన్నెగంటి సంతోషం వ్యక్తం చేశారు. 'వర్జిన్ గెలాక్టికవ వ్యోమనౌకలో బ్రాన్సన్‌తో కలిసి ఆరుగురితో యూనిటీ 22 టెస్ట్ ఫ్లైట్ జూలై 11, గురువారం సాయంత్రం న్యూ మెక్సికో నుండి బయలు దేరుతుందని కంపెనీ ప్రకటించింది.అంతరిక్ష ప్రయాణాల కోసం గత వారంలో వర్జిన్ గెలాక్టిక్ అమెరికాకు చెందిన ది ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ అనుమతులు సాధించిన సంగతి తెలిసిందే. ఈ రాకెట్‌లో అంతరిక్షంలోకి వెళ్లేందుకు ఇప్పటికే దాదాపు 600మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారట. మరోవైపు అమెజాన్ చీఫ్ జెఫ్ బెజోస్ ఈ నెల(జూలై) 20న అంతరిక్ష పర్యటనకు పోటీగా ఆయన కంటే ముందుగానే వర్జిన్ గెలాక్టిక్ రంగంలోకి దిగుతుండటం గమనార్హం.కాగా 2015లో వర్జిన్ గెలాక్టిక్‌లో ప్రభుత్వ వ్యవహారాల మేనేజర్‌గా చేరారు శిరీష. అప్పటినుండి వర్జిన్ ఆర్బిట్ కోసం వాషింగ్టన్ కార్యకలాపాలను నిర్వహిస్తూ అనేక ఉన్నత ర్యాంకులను సొంతం చేసుకుంటూ ఎదిగారు. పర్డ్యూ విశ్వవిద్యాలయంలో గ్రాడ్యుయేషన్ చేసిన శిరీషా జార్జ్‌టౌన్ యూనివర్సిటీ నుండి మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ పట్టా పొందారు.

# ఏపీలో కొత్తగా 3,464 కరోనా కేసులు



అమరావతి: ఏపీలో కొత్తగా 3,464 కరోనా కేసులు నమోదు కాగా 35 మరణాలు చోటు చేసుకున్నాయి. ఏపీలో ఇప్పటివరకు 18 లక్షల 96 వేల 818కి కరోనా సోకింది. మొత్తం 12 వేల 779 మంది కరోనా మృతి చెందారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంకా 37,323 కేసులు యాక్టివ్ ఉండగా ఇప్పటివరకూ 18 లక్షల 46 వేల 716 మంది చికిత్స పొంది రికవరీ అయ్యారు. తాజాగా రాష్ట్రవ్యాప్తంగా 24 గంటల్లో 4 వేల 284 మంది రికవరీ అయ్యారు.

గడిచిన 24 గంటల్లో 93,759 మందికి కరోనా టెస్టు చేశారు. చిత్తూరు, ప్రకాశం జిల్లాల్లో ఐదుగురు, తూ.గో, గుంటూరు జిల్లాల్లో నలుగురు, కృష్ణా, శ్రీకాకుళం జిల్లాల్లో ముగ్గురు, అనంతపురం, నెల్లూరు, విశాఖ, విజయనగరంలో ఇద్దరు, కడప, కర్నూలు, ప.గో జిల్లాల్లో ఒకరు చొప్పున మృతి చెందినట్లు వైద్యారోగ్య శాఖ వెల్లడించింది.

# సంపాదకీయం

శనివారం 03 జూలై 2021

## భారీ ఉద్దీపన ప్యాకేజీతో నిర్మలా సీతారామన్

గత ఏడాది కరోనా విజృంభించినప్పుడు దేశం కోలుకోవడానికి ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ భారీ ఉద్దీపన ప్యాకేజీ ప్రకటించారు. దాని విలువ 21 లక్షల కోట్ల రూపాయలు. అమెరికాతో సమానంగా మన దేశ స్థూల జాతీయోత్పత్తిలో పదిశాతం పైగా కేటాయించామన్నారు. కరోనా నుంచి బయటపడేయడానికి ఈ మొత్తం వినియోగిస్తున్నామని చెప్పుకొచ్చారు. రెండో విడత కరోనా వ్యాప్తి తర్వాత మళ్లీ మరో ప్యాకేజీతో నిర్మలా సీతారామన్ ప్రజల ముందుకు వచ్చారు. ఇప్పుడు దాని విలువ ఆరు లక్షల ముప్ఫైవేల కోట్ల రూపాయలు. దీంతో మళ్లీ ప్రజలు బాగుపడతారు. దేశం గట్టున పడుతోందని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. నిజానికి మొదటి విడత కంటే ఈ దఫా ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. ప్రాణ నష్టమే కాకుండా సంపద నష్టం కూడా గతంతో పోలిస్తే చాలా ఎక్కువ. మొదటి దశలో చికిత్సలపై ఎక్కువగా ప్రభుత్వమే బాధ్యత తీసుకుంది. ప్రజలపై అతి తక్కువ భారం పడింది. కరోనా గురించి పూర్తి అవగాహన లేకపోవడం వల్ల ప్రయివేటు ఆసుపత్రులు చికి?త్స అందించడానికి ముందుకు రాలేదు. దాంతో ప్రజలు అప్పులు చేసి మరీ ఆరోగ్యానికి వెచ్చించాల్సిన అవసరం లేకుండా పోయింది. ఈసారి కరోనా గుట్టుమట్టు తెలియడంతో ప్రయివేటు ఆసుపత్రులు ప్రజల నిస్సహాయతను సొమ్ము చేసుకోవడానికి ఎగబడ్డాయి. అందినకాడికి కార్పొరేట్ రూపంలో దోచుకున్నాయి. ప్రభుత్వం చాలా వరకూ ప్రేక్షక పాత్ర పోషించింది. అందుకే ఈసారి ప్రజలు అప్పుల్లో కూరుకుపోయారు. చికిత్స పేరిట తల తాకట్టు పెట్టి రుణాలు తెచ్చుకున్నారు. ఈ సమయంలో ప్రకటించిన ప్యాకేజీ వాస్తవరూపంపై చర్చ మొదలైంది.ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీ మనీ మహేంద్ర జాలమని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు. ఇందులో ప్రజలకు నేరుగా అందించే మొత్తం 55వేల నుంచి 70 వేల కోట్ల రూపాయల మధ్యలో ఉంటుందని వ్యాపార పత్రికలు, రేటింగ్ సంస్థలు అంచనా వేస్తున్నాయి. మిగిలిన అయిదున్నర లక్షల కోట్ల రూపాయలు వివిధ మార్గాల్లో బ్యాంకులు అందచేసే రుణాలుగానే తేల్చి చెబుతున్నారు. తొలిదశలో ప్యాకేజీని తిమ్మిని బమ్మిని చేసినట్లుగానే ఈ సారి మరోసారి మాయ చేస్తున్నారనే విమర్శలు వినవస్తున్నాయి. రొటీన్ గా జరగాల్సిన రుణ కార్యక్రమాలను ఏకమొత్తంగా విధాన ప్రకటనగా చూపుతూ ప్రభుత్వం ప్రచారం పొందుతుందనే వాదన వినవస్తోంది. నిజానికి ఇటువంటి విపత్కర సమయాల్లో ఏ ప్రభుత్వమైనా నేరుగా ప్రజలకు అందించే నగదు సాయంపై దృష్టి పెట్టాలి. దేశంలో రెండు నెలలపాటు వ్యాపార, ప్రయివేటు ఉద్యోగ కార్యకలాపాలు స్తంభించిపోయాయి. అసంఘటితరంగం మొత్తం అస్తవ్యస్తమైపోయింది. తాజా గా ప్రకటించిన ప్యాకేజీలో కంపెనీలు, పెద్ద వ్యాపారాలకు రుణాలిచ్చే కార్యక్రమం చేస్తామంటున్నారు. ప్రజల కొనుగోలు శక్తి క్షీణించిన దశలో ఉత్పత్తి ని పెంచుకునేందుకు అప్పులు ఎవరు తీసుకుంటారనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఒకవేళ ప్రభుత్వ గ్యారంటీతో డబ్బులు వస్తున్నాయని కొందరు ముందుకు వచ్చినా దుర్వినియోగం చేసేందుకు ఆస్కారం ఏర్పడుతుంది. సామాన్య ప్రజలకు , మధ్యతరగతి , పేద వ్యాపారులకు, నిర్మాణ రంగంలోని కూలీలకు ఒరిగేదేమీ ఉండదు.నిజానికి గడచిన ప్యాకేజీలు ఎంతవరకూ అమలయ్యాయనే అంశాన్ని కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా దాచి పెడుతోంది. ఇప్పుడు ప్రకటించిన దానిపై ప్రజలకు నమ్మకం ఏర్పడాలంటే కనీసం గత ఏడాది ఉద్దీపనపై స్పష్టత అవసరం. అప్పటి ప్యాకేజీ వల్ల ఏయే వర్గాలకు ఎంతమేరకు ప్రయోజనం సమకూరింది. అందువల్ల ప్రభుత్వంపై పడిన భారమెంత? బ్యాంకులు అందించిన మొత్తమెంత? ఇటువంటి గణాంకాలు ప్రభుత్వ చిత్తశుద్ధిని చాటి చెబుతాయి. అయితే ప్యాకేజీలు ఎప్పటికప్పుడు పరగడుపున పడుతున్నాయి. ప్రజలు పెద్దగా జ్ఞాపకం పెట్టుకోరనే విషయం ప్రభుత్వాలకు అలుసుగా మారింది. నిజానికి గత ప్యాకేజీల్లో అమలైంది నలభై శాతం లోపుగానే ఉందని బ్యాంకింగ్ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అందులో ప్రభుత్వంపై పడిన భారం రెండు లక్షల కోట్ల రూపాయల లోపుగానే ఉంది. భారత గోదాముల్లో దాదాపు ఏడు కోట్ల టన్నుల ధాన్యాలు మగ్గుతున్నాయి. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో వాటిని పంపిణీ చేసి కూడా ప్రభుత్వం ఆర్థిక లెక్కల్లో చెప్పేసి సాయంగా ఘనతను చాటుకుంటున్నారు. ప్రభుత్వ ఖజానాపై పెద్దగా భారం పడకుండా ప్రచారం పొందడమెలా? అన్న అంశంపైనే కసరత్తు సాగిస్తున్నారు. తీవ్రమైన అంటు రోగాల విషయంలో ప్రభుత్వ బాధ్యత అత్యంత కీలకమైనది. కరోనా ప్రపంచానికి చాటి చెప్పిన గుణపాఠం ఇదే. ప్రయివేటు ఆసుపత్రులు తొలి దశలో చాలా వరకూ సేవలు అందించడానికే భయపడ్డాయి. కానీ ప్రభుత్వ ఆసుపత్రులే భరించాల్సి వచ్చింది. ప్రభుత్వ రంగంలో మౌలిక వసతులను మెరుగుపరచుకోవడం ద్వారానే ప్రజలపై భారం తగ్గుతుంది. తాజా ప్యాకేజీలో ధర్మాసుపత్రుల్లో పెట్టుబడులకు నిధులు కేటాయించలేదు. కానీ ప్రయివేటుగా కార్పొరేట్ ఆసుపత్రులు తెరుస్తామంటే వంద కోట్ల రూపాయల వరకూ రుణం ఇస్తామంటూ చెబుతున్నారు. ఇందుకోసం 50 వేల కోట్ల రూపాయల వరకూ బ్యాంకు రుణాలకు ప్రభుత్వం హామీ ఇస్తానంటోంది. దాదాపు పదిశాతం వడ్డీ సైతం బ్యాంకులకు చెల్లించాల్సి ఉంటుంది. ఇంత పెద్ద మొత్తంలో నిధులు తీసుకుని, వడ్డీలు చెల్లించే ఆసుపత్రులు చౌకగా రోగులకు సేవలందిస్తాయనుకోవడం అత్యాశే. దీనివల్ల ప్రభుత్వమే వైద్య సేవలను ఖరీదైన వ్యవహారంగా మార్చేసినట్లవుతుంది. మొత్తమ్మీద ఆత్మనిర్భరతతో నిర్మలా సీతారామన్ నిబ్బరంగా కనిపిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వమూ నిబ్బరం నటిస్తోంది. కానీ ప్యాకేజీ ప్రజల్లోనే నిబ్బరం కల్పించలేకపోతోంది.

# రాజుకుంటున్న సింహాచలం భూములు

విజయనగరం, జూలై 2, (న్యూస్ పల్స్)మాన్సస్ ట్రస్టు ఛైర్మన్ పదవి నుంచి ఇటీవల కోర్టు ఉత్తర్వులతో సంచయితా గజపతిరాజు వైదొలగి, మళ్లీ పూసపాటి అశోక గజపతిరాజు పున: నియామకం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం సింహాచలం దేవస్థానం భూముల్లో గతంలో జరిగిన అక్రమాలను, అశోక గజపతిరాజు ట్రస్టు ఛైర్మన్‌గా గతంలో చేసిన పనులను వెలికితీసే పనిని తాజాగా ముమ్మరం చేసింది. దీంతో వివాదం మరలా 'రాజు'కుంటోంది.సింహాచలం దేవస్థానం, మాన్సాస్ ట్రస్టుకు సంబంధించి సుమారు 748 ఎకరాల భూమిని నిబంధనలు పాటించకుండా కబ్జా చేసే వ్యవహారంపై పూర్తిస్థాయిలో ప్రభుత్వం విచారణ ప్రారంభించింది. విజయనగరం, విశాఖపట్నం జిల్లాల జాయింట్ కలెక్టర్లే నేరుగా సర్వే చేసేలాగ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 29న ఆదేశించింది. విజయనగరం జిల్లా కొత్తవలస, విశాఖలోని భీమునిపట్నం ప్రాంతంలో ఈ అన్యాక్రంతం అయిన భూముల్లో ప్రాథమికంగా 36 ఎకరాలు గుర్తించినట్లు తెలుస్తోంది.. ఈ మొత్తం 748 ఎకరాలపై కోర్టుకు సమర్పించిన ఆధారాలన్నిటితో పాటు అశోక్‌గజపతిరాజు ఛైర్మన్‌గా ఉన్న కాలంలో జరిగిన మరిన్ని అక్రమాలు బయటకొస్తాయంటూ వైసిపి నేతలు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో విజయనగరం జేసి కిశోర్‌బాబు, విశాఖపట్నం జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డికి ఈ విచారణ బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. వీరు ఇచ్చే నివేదిక ఆధారంగా బాధ్యులపై చర్యలు, ఈ భూ అవకతవకలకు పాల్పడిన పెద్దల పాత్రను బహిర్గతం చేస్తామంటూ విశాఖలో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో రాజ్యసభ సభ్యులు వి.విజయసాయిరెడ్డి, రాష్ట్ర మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు సంయుక్తంగా ఉద్ఘాటించారు. ఇదెవరిపైనా కక్ష సాధింపు కాదని, అది ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. తర్వాత పంచ గ్రామాల భూ సమస్యకు సైతం సులభంగా పరిష్కారం లభిస్తుందని, సింహాచలం పంచ గ్రామాలకు చెందిన భూ సమస్యపై వివాదం కోర్టులో పెండింగులో ఉందని, ఈ కేసును అడ్వకేట్ జనరల్ (ఏజి) హైకోర్టు ధర్మాసనానికి నివేదించినట్లు విజయసాయిరెడ్డి తాజాగా స్పష్టం చేశారు. అంతేగాక సింహాచలం దేవస్థాన భూముల్లో నివాసాలుంటున్న సుమారు 12 వేల మందికి రెగ్యులరైజేషన్ ప్రక్రియను ప్రభుత్వం చేపడుతుందన్నారు. గతంలో అశోక్‌గజపతిరాజు మాన్సాస్ ట్రస్ట్ ఛైర్మన్‌గా దీన్ని జరగకుండా, చంద్రబాబు పాలనలో వీరిద్దరూ అడ్డుకున్నారన్నారు. కోర్టు ఉత్తర్వులు జులై (2021)లో రానున్నాయి. దీంతో పంచ గ్రామాల్లో నివాసం ఉండే వారి భూ క్రమబద్దీకరణకు చర్యలు తీసుకోనున్నట్లు ప్రకటించారు. ఎస్టేట్ ఎబాలిషన్ యాక్ట్ అమల్లోకి వచ్చిననాటి నుంచి ఇప్పటివరకూ మాన్సాస్ ట్రస్ట్‌లో జరిగిన అవకతవకలన్నిటినీ బయటకు లాగుతామన్న విజయసాయిరెడ్డి వ్యాఖ్యలతో తెలుగుదేశం పార్టీ నేతల్లో... ముఖ్యంగా విజయనగరం జిల్లాకు చెందిన పూసపాటి అశోక్‌గజపతిరాజు కూడా స్పందిస్తూ... అంతా సక్రమంగానే ట్రస్టు నడిచిందంటూ తాజాగా వెల్లడించారు. 1997 సంవత్సరంలో సింహాచలం దేవస్థానం భూములకు చంద్రబాబు నాయుడు నేతృత్వంలో పట్టాల జారీలో జరిగిన అక్రమాలపైనా తాజాగా ప్రభుత్వం కోర్టులో కేసు వేసినట్లు తెలుస్తోంది.

ఈ అక్రమాలూ బయటకొస్తే టిడిపికి చెందిన పలువురి నేతలపై చర్యలుంటాయంటూ వైసిపి నేతలు చెబుతున్నారుసింహాచలం భూముల అక్రమాలపై ఈనెల 29న రాష్ట్ర ప్రభుత్వం చర్యలను ప్రారంభిస్తూ... దేవస్థానానికి గతంలో ఈవోగా పనిచేసిన రామచంద్రమోహన్‌ను సరెండర్ చేసింది. దేవాదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ ఈ మేరకు ఉత్తర్వులు జారీచేశారు. 2016లో ఈవోగా ఈయన విశాఖలో సింహాచలం దేవస్థానంలో పనిచేసి, తాజాగా రాష్ట్ర కమిషనర్ కార్యాలయంలో అడిషనల్ కమిషనర్ -2గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఈయనకు ప్రభుత్వం సడెన్ షాక్ ఇచ్చింది. 748 ఎకరాల భూ అవకతవకలపై విచారణ ప్రారంభించిన సంకేతాలను, ఆ అవకతవకలు జరిగిన సందర్భంగా ఈయన కూడా అక్రమాల్లో భాగస్వామ్యం అయినట్లు దేవాదాయశాఖ గుర్తించింది.

# ఎన్ఆర్ ఐ ఆస్పత్రి పై గద్దలు

గుంటూరు, జూలై 2, (న్యూస్ పల్స్)రాజధాని ప్రాంతంలోని మంగళగిరి ఎన్ఆర్ఐ ఆస్పత్రిపై గద్దలు వాలాయి. ఆస్పత్రిని అమ్మాల్సిందేనని, లేకపోతే భూమ్మీద నూకలు చెల్లిపోతాయని బెదిరించేంత తీవ్ర పరిస్థితులేర్పడడం గమనార్హం. మొత్తం డైరెక్టర్లలో 14 మంది అమ్మకానికి అంగీకరించినా, 16 మంది వ్యతిరేకంగా ఉన్నారని సమాచారం. దీంతో వారిపై కేసుల పరంపర మొదలైందని బలమైన ఆరోపణలొస్తున్నాయి. వివాదాల పేరిట, జరిమానాలు విధించి వారిని తీవ్ర ఇబ్బందులు పెట్టడంతో వారు భయాందోళనలకు గురవుతున్నారు. దీనివెనుక పెద్దలు ఉండటంతో జరిగిందంతా నిర్భయంగా చెప్పడానికి ఎవరూ ధైర్యంగా ముందుకు రావడం లేదు. ఒకవైపు రాజధాని ఇక్కడ ఉండదన్న ప్రచారం సాగుతుండగానే మరోవైపు కీలకమైన ఆస్తులు, సంస్థల కొనుగోలుకు సంబంధించిన చిత్ర విచిత్ర వ్యవహారాలు జరుగుతుండడం ఆశ్చర్యకరం. 23 ఎకరాల విస్తీర్ణంలో భవనాలు, 750 పడకలు గల మంగళగిరి ఎన్ఆర్ఐ ఆస్పత్రిని అమ్ముతున్నారంటూ ఇటీవల వార్తలు గుప్పుమన్నాయి. ఎన్ఆర్ఐ ఆస్పత్రిని తమకు అమ్మాలని రెండు నెలల క్రితం కొంతమంది అధికార పార్టీ నేతలు ఆస్పత్రి బోర్డును సంప్రదించారు. బోర్డులో 14 మంది అమ్మేందుకు సిద్ధపడగా 16 మంది వ్యతిరేకించారు. కొనుగోలు చేయాలనుకున్నది పెద్దలు కావడంతో కాదంటున్నవారిపై మంగళగిరి పోలీసు స్టేషన్లో కేసులు నమోదయ్యాయి. వేధింపుల పర్వం మొదలైంది. గొడవను సర్దుబాటు చేసి బేరసారాలు జరిపేందుకు తెలుగు రాష్ట్రాల్లో పేరెన్నికగన్న ఓ కాంట్రాక్టు కంపెనీ యాజమాన్యం జోక్యం చేసుకున్నట్లు తెలిసింది. దీంతో ఆ కంపెనీయే స్వాధీనం చేసుకుంటుందనే వార్తలు వచ్చాయి. అమ్మకం ఒప్పందం చేసుకోకపోతే తీవ్ర పర్యవసానాలుంటాయని బెదిరిస్తున్నారని కొంతమంది వాటాదారులు ఇటీవల విలేకరుల సమావేశంలో తెలిపారు. దీనివెనుక కొంతమంది ప్రభుత్వ పెద్దలున్నారని, వారి మాట వినడం లేదనే ఉద్దేశంతోనే తమపై కక్షసాధింపులకు దిగుతున్నారని, జరిమానాలు, కేసులు అన్నీ ఆస్పత్రి అమ్మకాన్ని వ్యతిరేకించిన వారిపైనేనని వివరించారు. తమకు ప్రాణహాని జరిగితే ప్రభుత్వానిదే బాధ్యతని తెలిపారు.విజయవాడ, గుంటూరు మధ్యలో విశాల వాతావరణంలో ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాల, అనుబంధంగా ఆస్పత్రి ఉంది. 10 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో(సుమారు 23 ఎకరాలు) నిర్మాణాలు, 750 బెడ్లు ఉన్నాయి. అన్ని రకాల వైద్య పరీక్షలకు అవసరమైన ల్యాబరేటరీలు ఏర్పాటు చేశారు. అన్ని సదుపాయాలూ ఉండటంతోపాటు విలువ కూడా ఎక్కువ కావడంతో కొనుగోలు చేసేందుకు కొంతమంది పెద్దలు సిద్ధపడ్డట్లు తెలిసింది. ఎంబిబిఎస్, పిజి, సూపర్‌స్పెషాలిటీ కోర్సులతోపాటు పారామెడికల్ కోర్సులూ ఉన్నాయి. మొత్తం 200 మెడికల్ సీట్లు ఉండగా వీటిల్లో ఎ కేటగిరీలో 100, బి కేటగిరీలో 70, సి కేటగిరీలో 30 సీట్లు ఉన్నాయి. ఎంబిబిఎస్ సీటు రూ.36 లక్షలు, పిజి సీటు రూ.80 లక్షల వరకూ పలుకుతుంది. ఇలాంటి కారణాలవల్ల ఈ బోధనాసుపత్రికి డిమాండు ఏర్పడింది.

# నెల్లూరులో జిందాల్ ప్లాంట్

నెల్లూరు, జూలై 2, (న్యూస్ పల్స్)ప్రముఖ స్టీల్ ఉత్పత్తి సంస్థ జిందాల్ నెల్లూరులో ప్లాంటు ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చింది. దీనికి సంబంధించిన ప్రతిపాదనలపై రాష్ట్ర ప్రభుత్వం వేగంగా కసరత్తు చేస్తోంది. అనేక పరిశ్రమలు రాష్ట్రాన్ని విడిచి వెళ్లిపోతున్నాయన్న విమర్శలు వస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జిందాల్ ప్లాంటు ఏర్పాటైతే ఆ విమర్శలను తిప్పికొట్టవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో త్వరలో జరగనున్న రాష్ట్ర పెట్టుబడుల అభివృద్ధి బోర్డ్ సమావేశంలో ఈ విషయమై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. దీనికి సంబంధించిన సిఫార్సులతో పరిశ్రమలు, ఆర్థికశాఖ అధికారులు సిద్ధమయ్యారు.నల్వా స్టీల్స్‌కు అనుబంధంగా ఉన్న జిందాల్ స్టీల్స్-జిందాల్ స్టీల్ అండ్ పవర్ లిమిటెడ్ జాయింట్ వెంచర్ సంస్థ నెల్లూరు జిల్లాలోని తమ్మినపట్నం, మొమిడి గ్రామాల్లో స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రతిపాదించింది. ఏడాదికి 2.25 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఏటా 2.25 మిలియన్ టన్నుల టిఎంటి ఇనుప బార్‌లు, వైర్ రాడ్స్ తయారు చేయడం ఈ ప్రతిపాదనల లక్ష్యం. దీనికి రూ.7500 కోట్లు పెట్టుబడి వ్యయం అవుతుందని అంచనాపరిశ్రమ ప్రారంభమైతే ప్రత్యక్షంగా 2500 మందికి, మరోక్షంగా 15 వేల మందికి ఉపాధి లభిస్తుందని ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. దీనికోసం వెయ్యి నుంచి మూడు వేల ఎకరాల భూమి కావాల్సి ఉంటుందని కోరారు.దీనిపై ఇప్పటికే రాష్ట్ర పరిశ్రమలు, మౌలిక వసతుల సంస్థ అధ్యయనం చేసి 860 ఎకరాలు అవసరమవుతుందని తేల్చారు. భూమిని ఎపిఐఐసి నిర్ణయించిన ధరకు ఇవ్వాలని, పునరావాసం వ్యయాన్ని జిందాల్ భరించేలా ప్రాథమికంగా నిర్ణయం తీసుకున్నారు. ప్రాథమికంగా ఎపిఐఐసి కొన్ని సిఫార్సులను చేసిరది. ఇందులో భాగంగా ఈ రెండు గ్రామాల్లో ఉన్న సాధారణ భూమి ధర, ఎపిఐఐసి సిఫార్సు చేసిన ధర, ఆ గ్రామాల్లో సగటున జరుగుతున్న అమ్మకపు ధర, 2013 భూసేకరణ చట్టం మేరకు ఉన్న ధరలతో వివరాలు సిద్ధం చేసారు. దీనిలో ఎరత ధరకు భూమిని జిందాల్‌కు ఇస్తారన్నది ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. అయితే గతంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటుచేసేరదుకు ముందుకొచ్చిన కినేటా పవర్ సంస్థకు ఇచ్చిన భూమినే ఇప్పుడు జిందాల్‌కు ఇవ్వాలని భావిస్తున్నారు.

# రాంగ్ రూట్లో విజయసాయి..?



విశాఖపట్టణం, జూలై 2, (న్యూస్ పల్స్)విజయసాయిరెడ్డి రాంగ్ రూట్లో వెళ్తున్నారా. జగన్ మనసెరిగి పనిచేస్తున్నాను అనుకుంటూనే ముఖ్యమంత్రికే కొత్త తలనొప్పులు తీసుకువస్తున్నారా అంటే సమాధానం అవును అనే వస్తోంది. ప్రతీ రోజూ ట్వీట్లు చేస్తూ చంద్రబాబు సహా ప్రత్యర్థులతో చెడుగుడు ఆడే విజయసాయిరెడ్డి ఏనాడో హద్దులు దాటేశారు అన్న మాట సొంత పార్టీలోనే ఉంది. జగన్ కి ఆయన కుడి భుజం కాబట్టి ఎవరూ పైకి మాత్రం చెప్పలేకపోతున్నారు. ఇక ఉత్తరాంధ్రా మూడు జిల్లాలను చూస్తే బాధ్యతను జగన్ అప్పగిస్తే విజయసాయిరెడ్డి ఏకంగా తానే సామంతరాజు అన్నట్లుగా ఫీల్ అవుతున్నారని కూడా విమర్శలు ఉన్నాయి.విజయసాయిరెడ్డికి జగన్ కి దూరం బాగా పెరిగింది అన్న ప్రచారం అయితే చాలా కాలంగా ఉంది. ముఖ్యంగా విశాఖ కార్పోరేషన్ ఎన్నికల్లో తొంబై సీట్లు తెస్తానని చెప్పి సర్వ స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకున్న విజయసాయిరెడ్డి చివరికి అత్తెసేరు సీట్లతో తన పేలవమైన ప్రదర్శనను చాటుకున్నారు. అపుడే జగన్ ఆయన పనితీరు పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు అన్న టాక్ వినిపించింది. ఆ తరువాత కూడా విశాఖలో పార్టీని పక్కన పెట్టి తానే హైలెట్ అవుతూ ఆయన చేస్తున్న రాజకీయ విన్యాసం కూడా హై కమాండ్ దృష్టి దాటిపోలేదు అంటున్నారు. ఇక మాన్సాస్ ట్రస్ట్ వ్యవహారంలో ఏకంగా పార్టీకి, ప్రభుత్వానికీ కూడా నష్టం కలిగించే విధంగా విజయసాయిరెడ్డి చేశారు అంటున్నారు.నిజానికి మాన్సాస్ ట్రస్ట్ ని టచ్ చేయాలన్న ఆలోచన ఎక్కడా జగన్ సర్కార్ కి లేదు అంటారు. విశాఖలో రాజధానికి కావాల్సిన భూములను సేకరించే క్రమంలో సింహాచలం దేవస్థానానికి ఎక్కువగా ఉన్న భూములను విజయసాయిరెడ్డి సహా స్థానిక నేతలు గుర్తించారు. అలా మాన్సాస్ ట్రస్ట్ మీదకు కూడా చూపు మళ్ళిందని అంటారు. అయితే ఈ విషయంలో ఒక స్వామిజీ సలహా సూచనలకు విజయసాయిరెడ్డి తలవొగ్గారని, ఆ విధంగా పార్టీకి ఏ మాత్రం సంబంధం లేని సంచయిత గజపతిరాజుని చైర్ పర్సన్ గా తెచ్చి మాన్సాస్ ట్రస్ట్ ని అతి పెద్ద వివాదంగా మార్చేశారు అంటున్నారు. చివరకు కోర్టు మొట్టి కాయలతో ప్రభుత్వానికి తల బొప్పి కట్టినట్లు అయింది.ఉత్తరాంధ్ర జిల్లాలలో జీవం లేకుండా ఉన్న టీడీపీకి బలమిచ్చేలా విజయసాయిరెడ్డి అనేక నిర్ణయాలు ఉన్నాయని అంటున్నారు. పూసపాటి కుటుంబంలో ఉన్న ఆస్తుల వివాదంలోకి ప్రభుత్వం దూరి అపఖ్యాతి పాలు అయింది అన్న మాట కూడా ఉంది. విజయనగరం జిల్లాలో 2019 ఎన్నికల్లో జీరో తెచ్చుకున్న టీడీపీకి అక్కడే ప్రాణం పోసేలా అశోక్ వ్యవహారం ఉందని అంటున్నారు. అలాగే గోదావరి జిల్లాల్లో రాజులు కూడా వైసీపీకి దూరం అయ్యే సీన్ కనిపిస్తోంది. అశోక్ మీద విజయసాయిరెడ్డి చేసిన తీవ్ర వ్యాఖ్యలను రాజకీయలకు అతీతంగా అంతా తప్పుపడుతున్నారు. చివరకు చంద్రబాబుకు బద్ధ విరోధి అన్న పేరున్న కాపు నేత ముద్రగడ పద్మనాభం కూడా జగన్ ఈ విషయంలో విజయసాయిరెడ్డిని కట్టడి చేయాల్సిందే అంటూ లేఖ రాయడం దుమారం రేపుతోంది. ఈ పరిణామాలతో పాటు మంత్రి పదవులు కోరుకుంటున్న కొందరు విజయసాయిరెడ్డిని ఆశ్రయించడం కూడా హై కమాండ్ దృష్టిలో ఉందిట. ఆయన్ని నమ్ముకుంటే పదవులు కాదు కదా ఏమీ ఇచ్చేది లేదు అన్న సంకేతాలు కూడా పంపించాలని హై కమాండ్ డిసైడ్ అయిందట. అలాగే విజయసాయిరెడ్డి రాజ్యసభ సభ్యత్వం వచ్చే ఏడాది ముగుస్తుంది. ఈ లోగా ఆయన తీరు మార్చుకోకపోతే మాత్రం పెద్ద చెక్ పడిపోతుందని కూడా ఊహిస్తున్నారు.

# అప్ డేట్ పాలిటిక్స్ లో లోకేష్



గుంటూరు, జూలై 2, (న్యూస్ పల్స్)నారా లోకేష్ కి సలహాలు ఇపుడు బాగానే అందుతున్నాయి. ఆయన తండ్రి చంద్రబాబు ఎటూ చాణక్యుడిని చంపి పుట్టిన వాడు. అదే సమయంలో నారా లోకేష్ సొంతంగా ఒక అడ్వైజరీ టీమ్ ని పెట్టుకుని ఈ కాలానికి తగినట్లుగా పాలిటిక్స్ చేస్తున్నారు. లోకేష్ మేకోవర్ నుంచి ఆయన బాడీ లాంగ్వేజ్, మాటల తూటాలు అన్నీ కూడా సలహాదారుల నుంచి వచ్చినవే అంటున్నారు. నారా లోకేష్ జగన్ని కిర్రెక్కించాలని గట్టిగా డిసైడ్ అయ్యారు. జగన్ ని ఢీ కొడితే పేరుకు పేరు వస్తుంది. రాజకీయ స్థాయి కూడా పెరుగుతుంది. అదే సమయంలో ఆయనకు చిర్రెత్తుకు వస్తే కాగల కార్యం నెరవేరుతుంది అన్నదే లోకేష్ ఆలోచనట.రఘురామరాజు వైసీపీలో రెబెల్ ఎంపీ, ఆయన్ని జగన్ సర్కార్ అరెస్ట్ చేయడంతో ఒక్కసారిగా హీరోగా మారిపోయాడు. తన మీద రిమాండ్ లో పోలీసులు దాష్టికానికే పాల్పడ్డారంటూ రాజు చేసిన ఆరోపణలు, రాసిన లేఖలు ఇపుడు జాతీయ స్థాయిలో చర్చకు వచ్చాయి. ఒక్క దెబ్బకు జగన్ సర్కార్ ని బదనాం చేసి పారేశారు. ఇదిలా ఉంటే ఆయన్ని చూసిన మీదట నారా లోకేష్ లోనూ కొత్త ఆలోచనలు వస్తున్నాయట. తాను కూడా గట్టిగానే జగన్ మీద బాణాలు వేయడం కూడా అందుకోసమేనట.నారా లోకేష్ ఒక్కసారి అయినా అరెస్ట్ కావాలని ఉందిట. ఏపీలో జగన్ సర్కార్ కొలువు తీరాక టీడీపీలో మంత్రులుగా పనిచేసిన వారి నుంచి పెద్ద నాయకులను చాలా మందిని అరెస్ట్ చేశారు. అయితే నారా లోకేష్, చంద్రబాబు మీద వైసీపీ చూపు ఉందని ఆ మధ్యన వార్తలు వచ్చాయి. వారిని అరెస్ట్ చేసి జైలు దారి చూపించాలని వైసీపీ పెద్దలు అనుకున్నా రాజకీయ సమీకరణలలో తేడాలు వస్తాయనే ఇన్నాళ్ళూ ఆగారు. కేవలం పోలీస్ కేసులు మాత్రమే పెడుతూ వస్తున్నారు. అయితే ఇపుడు నారా లోకేషే ముందుకు వచ్చి అరెస్ట్ చేసుకోండి అన్నట్లుగానే దూకుడు చూపిస్తున్నారు.నారా లోకేష్ అసలు తగ్గేది లేదు అన్నట్లుగా జగన్ మీద డైరెక్ట్ అటాక్ చేస్తున్నారు. కర్నూల్ టూర్ లో జగన్ ని ఏక వచనంతో సంభోదిస్తూ కొంత వివాదస్పదమైన వ్యాఖ్యలే లోకేష్ చేశారు. ఆ వెంటనే అన్న కాదు దున్న అంటూ జగన్ మీద దారుణమైన కామెంట్స్ చేశారు. అంటే నారా లోకేష్ ఉద్దేశ్యం తెలిసిపోతోంది అంటున్నారు. జగన్ ని గట్టిగా గిల్లీ గిచ్చి తాను అరెస్ట్ కావడమే ఆయన టార్గెట్ అంటున్నారు. ఇలా పర్సనల్ గా విమర్శలు చేస్తే జగన్ ఊరుకునే రకం కాదు, అరెస్ట్ చేస్తారు.

# జగన్ కు జాతీయ పార్టీల నుంచి కాల్స్

విజయవాడ, జూలై 2, (న్యూస్ పల్స్)జాతీయ రాజకీయాలు వచ్చే ఎన్నికల నాటికి అనేక రకాలుగా మారతాయి. కాంగ్రెస్, బీజేపీతో పాటు దేశంలో ఉన్న ప్రాంతీయ పార్టీలు కూడా కీలకంగా మారనున్నాయి. ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు జాతీయ పార్టీలను తోసిరాజని అధికారంలోకి వచ్చాయి. కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో కూడా రానున్న కాలంలో క్రియాశీల పాత్రను పోషించనున్నాయి. దీంతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ కు జాతీయంగా డిమాండ్ పెరగనుంది.ఏపీ ముఖ్యమంత్రి జగన్ ఇప్పుడు బలంగా ఉన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కాంగ్రెస్ పక్షాన ఉన్నారు. ఇక తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కాంగ్రెస్, బీజేపీల వ్యతిరేక వైఖరిని అవలంబిస్తున్నారు. జగన్ మాత్రం అంటీ ముట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇటు ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతో పాటు, కొన్ని ప్రాంతీయ పార్టీల అధినేతలతోనూ జగన్ టచ్ లో ఉన్నారని చెబుతున్నారు.ప్రధానంగా మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని అందరూ భావిస్తున్నారు. నిధుల విషయంలో కాని, ముఖ్యమైన ప్రాజెక్టుల విషయంలో తమ ప్రాంతాలకు అన్యాయం జరుగుతుందని, కొన్ని ప్రాంతాలకే మోదీ అనుకూలంగా ఉన్నారన్న విమర్శలున్నాయి. దీంతో ప్రాంతీయ పార్టీల అధినేతలు మోదీ వ్యవహార శైలి పట్ల గుర్రుగా ఉన్నారు. శరద్ పవార్ లాంటి నేతలు కాంగ్రెస్, బీజేపీయేతర ప్రాంతీయ పార్టీల నేతలతో సమావేశం వెనక కూడా ఇదే కారణమని చెప్పాలి. అయితే దీనికి జగన్ దూరంగా ఉన్నా ఒక కీలక నేతతో టచ్ లో ఉన్నారంటున్నారు.ఇక బీజేపీ కూడా జగన్ ను వదులుకునేందుకు సిద్ధంగా లేదు. దక్షిణాదిలో తమకు అండగా నిలిచే ఏకైక నేతగా బీజేపీ కేంద్ర నాయకత్వం జగన్ ను భావిస్తుంది. వచ్చే ఎన్నికల్లో జగన్ అవసరం తమకు ఉంటుందని భావించిన కేంద్రం పెద్దలు జగన్ ను దువ్వే ప్రయత్నాలు ప్రారంభించారు. జగన్ కూడా రాష్ట్ర ప్రయోజనాల కోసం వారికి అనుకూలంగానే ఉన్నట్లు వ్యవహరిస్తున్నారు. మొత్తం మీద రానున్న కాలంలో జాతీయంగా జగన్ కు డిమాండ్ పెరిగే ఛాన్స్ అయితే ఉంది.

# సీజనల్ వ్యాధులతో జరాభద్రం

ఒంగోలు, జూలై 2, (న్యూస్ పల్స్) వర్షాకాలం మొదలైంది. జాగ్రత్తగా ఉండకుంటే సీజనల్ వ్యాధులతో జేబులు గుల్ల చేసుకోవాల్సిందే. మనం పీల్చే గాలిలో మనుగడుకు మొట్టమొదటి అవసరమైన ప్రాణవాయువే కాక... ప్రాణాంతక వ్యాధులకు మూలమైన వైరస్‌లూ ఉంటాయి. అలాగే మనం నిత్యం జీవించే పరిసరాల్లోనే ఎన్నో జబ్బుల్ని వ్యాపింపజేసే కలుషిత వాతావరణమూ ఉంటుంది. రకరకాల పంటలనూ, ఫలాలనూ, పూలనూ కానుకగా రుతువులే... కొన్ని కష్టాలనూ తెచ్చిపెడతాయి. మొన్నటి వరకు ఎండలు ఉక్కుకి బిక్కిరి చేశాయి. జూన్ రెండో వారం నుంచి జిల్లా వ్యాప్తంగా ఓ మోస్తారు వర్షాలు కురుస్తున్నాయి. ఈ తరుణంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యశాఖ అధికారులు సూచిస్తున్నారు. గతేడాది జిల్లాలో డెంగ్యూ కేసులు 420, ఈ ఏడాది ఇప్పటి వరకు 6 డెంగ్యూ కేసులను గుర్తించారు. అప్రమత్తంగా లేకుంటే ఈ ఏడాది కూడా పారిశుధ్య లోపం డెంగ్యూ సోకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ సమయంలో దోమలు, ఈగలు, వైరస్, బ్యాక్టీరియా వ్యాప్తి చెంది సీజనల్ వ్యాధులు ప్రబలే బెడద ఎక్కువ. న్రపజలపై ప్రతాపం చూపుతాయి. తగిన జాగ్రత్తలు తీసుకుంటే టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ, డయేరియా. ఫైలేరియా, మెదడువాపు వంటి వ్యాధులను నిరోధించవచ్చు. వర్షకాలంలో వచ్చే వ్యాధులు, వాటిని నిరోధానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలుసుకొని అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కలుషిత నీటిని తాగడం, కలుషిత ఆహారం తినడంవల్ల డయేరియా ప్రబలే అవకాశం ఉంటుంది. వర్షాలకు ఇంటి పరిసరాలు చిత్తడిగా మారి ఈగలు పెరుగుతాయి. ఈగలు మనం తినే ఆహార పదార్థాలపై వాలి కలుషితం చేస్తాయి. దీంతో ఈ వ్యాధి వ్యాపిస్తుంది. ఈ వ్యాధి సోకకుండా పరిసరాల శుభ్రతను పాటించాలి. ఇంట్లోకి ఈగలు రాకుండా జాలీ వంటివి ఏర్పాటు చేసుకోవాలి. ఇంట్లో ఎక్కడ పడితే అక్కడ ఆహార పదార్థాలు, ద్రవపదార్థాలు పడేయకూడదు. వేడి పదార్థలను తినాలి. డెంగ్యు ..ఈ వ్యాధి అన్ని సీజన్ల లో వచ్చినా వర్షాకాలం ప్రారంభంలో



ఎక్కువగా వ్యాపిస్తుంది. ఇది 'ఎడీస్ ఈజిప్టు' అనే దోమ కుట్టడం వల్ల వస్తుంది. ఈ దోమ మంచినీటిలో పెరుగుతుంది. ఈ దోమ కుట్టిన పది రోజులకు వ్యాధి లక్షణాలు కనిపిస్తాయి. తీవ్రమైన జ్వరం, తలనొప్పి డెంగ్యూ లక్షణాలు. వ్యాధిగ్రస్తులకు రక్తకణాలు తగ్గి పరిస్థితి విషమించే ముప్పు ఉంది. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే డెంగ్యు సోకుండా చూసుకోవచ్చు ఇంట్లో కూలర్లు, పూలకుండీలు, రబ్బరు టైర్లు, పడేసిన కొబ్బరి చిప్పల్లో డెంగ్యు దోమలు పెరుగతాయి. నీటి ట్యాంకుల్లోనూ ఉంటాయి. నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. మెదడువాపు వ్యాధి...వర్షాలు కురిసే సమయంలో ఈ వ్యాధి ప్రబలుతుంది. దీన్ని ' జపనీస్ ఎన్‌సెఫలైటీస్' అని కూడా పిలుస్తారు. ఇది పందుల నుంచి మనుషులకు వ్యాపిస్తుంది. ఇంటి చుట్టూ పందులు సంచరించినా, ఇళ్ల మధ్యలో పందులను పెంచినా ఈ వ్యాధి మనుషులకు సంక్రమిస్తుంది. జర్వం, మెదడులో వాపు సంభవించి కొన్ని సందార్భల్లో కోమాలోకి వెళ్లే ప్రమాదం ఉంది. ఈ వ్యాధి సోకకుం డా పందులు ఇంటి పరిసరా ల్లో తిరగకుం డా చూసుకోవాలి. మొదట ఇంటి పరిసరాల్లో మురుగు గుంతలు, బురద గుంతలు లేకుండా చూసుకోవాలి. ఒక వేల ఉంటే గుంతలను పూడ్చేయాలి. వేసవిలో తక్కువగా ఉండే దోమలు, వర్షాలు కురవడంతో వృద్ధి చెందుతాయి, ' ఆడ' ఎనాఫిలస్ దోమ వల్ల మలేరియా వస్తుంది. నీటి నిల్వల్లో ఇది పెరగుతుంది. ఈ దోమ కుట్టిన వారం రోజుల్లో వ్యాధి లక్షణాలు బయటపడతాయి. సాయంత్రం చలి జ్వరం వస్తుంది. ఇంటి అవరణం, పరిసరాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం, దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవడం వల్ల ఈ వ్యాధి సోకకుండా ఉండవచ్చు. ఫైలేరియా.. క్యూలెక్స్ దోమ కాటు వల్ల ఫైలేరియా వ్యాధి సంక్రమిస్తుంది. శరీరంలోని ఏ భాగానికైనా ఈ వ్యాధి సోకే అవకాశం ఉంది. ముఖ్యంగా మురుగునీరు నిల్వ ఉండే చోట ఈ దోమలు పెరుగతాయి. వానాకాలం ప్రారంభంలోనే నీటి నిల్వలు, మురుగునీటి నిల్వలు, బురదనీరు ఎక్కడపడితే అక్కడ నిల్వ ఉండడంతో ఈ దోమలు వృద్ధి చెందుతాయి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మురికి నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం వల్ల దోమల వృద్ధిని అరికట్టి ఈ వ్యాధి సోకుండా చూసుకోవచ్చు. ఎండాకాలం పోయి వర్షాలు కురుస్తున్నందున వైరస్ ప్రభావం ఎక్కువ ఉంటుంది. వైరస్‌ల వల్లే మనుషులు అనారోగ్యానికి గురవుతారు. దగ్గు, జలుబుతో మొదలై జ్వరం వస్తుంది. వైరస్ తీవ్రత ఎక్కువగా ఉంటే వాంతులు, విరేచనాలు ఎక్కువై ప్రమాదం భారిన పడే అవకాశం ఉంది. వృద్ధుల్లో శ్వాసకోశ వ్యవస్థపై ప్రభావం పడుతుంది. ఆయాసం పెరిగి శ్వాస ఆడక ఇబ్బంది పడతారు. చిన్నపిల్లల్లో జ్వరం ఎక్కువగా వస్తే మూర్ఛపోయే అవకాశాలు ఎక్కువ. నిల్వ ఉన్న పదార్థలు తినకూడదు. ఇంటి అవరణంలో నిల్వకుండా జాగ్రత్తలుపాటించడం వల్ల వైరస్‌లు వ్యాపించవు. కలుషితమైన నీటిని తాగడం వల్ల కూడా శరీరంలోకి వైరస్ వ్యాపిస్తుంది. స్వచ్ఛమైన నీటిని తాగాలి. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేస్తున్నట్లు జిల్లా ఆస్పత్రుల సమన్వయాధికారి సరళమ్మ తెలిపారు

## టీచర్ కృషికి జాతీయ అవార్డు

అనంతపురం కరోనా పాండమిక్ సమయంలో పిల్లలు చదువుకు దూరం అవ్వుతున్నారని ఒక టీచర్ వినూత్నమైన బోధన పద్ధతికి శ్రీకారం చుట్టారు. దీంతో పిల్లలుతోపాటు తల్లిదండ్రులు ఆ టీచర్ కు ప్రశంసలు కురిపించారు. అంతే కాదు ఆ టీచర్ చేసిన కృషికి ఇప్పుడు జాతీయ అవార్డు కు ఎంపిక అయ్యారు. అనంతపురం జిల్లా పాలసముద్రం పాఠశాల బయాలజీ ఉపాధ్యాయురాలు మంజులకు జాతీయ అవార్డు లభించింది. 2018-19 సంవత్సరాలకు ఎన్సీఈఆర్టీ ఆధ్వర్యంలో సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ (ఐసీటీ) అవార్డులకు ఎంపిక చేశారు. జాతీయస్థాయిలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం, విద్యార్థులకు సాంకేతికత ద్వారా బోధన చేసేవారికి అవకాశం కల్పించారు. అందులో గోరంట్ల మండలం పాలసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బయాలజీ పాఠశాల సహాయకురాలు మంజులకు అవార్డు దక్కింది. ఆమె కొవిడ్ కంటే ముందు నుంచే సాంకేతిక అంశాలను ఉపయోగించి విద్యార్థులకు బోధన చేరువ చేశారు. 2019 సంవత్సరానికి జాతీయ స్థాయిలో 24 మందికి అవార్డు దక్కగా అందులో మంజుల ఉండటం జిల్లాకు గర్వకారణమని స్థానికులు అంటున్నారు.

## చోడవరం తహసిల్దార్ కార్యాలయం లో ఏసీబీ దాడులు

విశాఖపట్నం చోడవరం తహసిల్దార్ కార్యాలయంలో ఎసిబి సోదాలు కొనసాగాయి. తాసిల్దార్ రవి కుమార్ తో పాటు డిప్యూటీ తాసిల్దార్ రాజా, డ్రైవర్ రమేష్ ను నిందితులుగా చేర్చిన ఏసీబీ అధికారులు విచారణ పూర్తి చేశారు. నరసాపురంలో 1.6 ఎకరాల స్థలం మ్యుటేషన్, నరసయ్య పేటలో 60 సెంట్ల స్థలం కన్వర్షన్ చేయడానికి తొమ్మిది లక్షలు డిమాండ్ చేశారు. దీంతో చివరకు 4.50 లక్షలకు బాధితుడు తో ఒప్పందం కుదుర్చుకున్న ఎమ్మార్వోకు సిబ్బంది లంచం ఇవ్వడానికి నిరాకరించారు. తరువాత ఏసీబీ అధికారులను బాధితుడు ఆశ్రయిం చాడు. లంచం ఇస్తుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నట్టు ఏసీబీ డిఎస్పీ రామచంద్ర రావు తెలిపారు.

## శ్రీస్వామివారి నిత్యకళ్యాణం

**- భారీ వర్షంలోనూ తగ్గని భక్తుల తాకిడి**

విశాఖపట్నం సింహాచలం శ్రీవరాహలక్ష్మీనృసింహస్వామివారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుంటున్నారు. వర్షం కురుస్తున్నా లెక్కచేయకుండా భక్తి శ్రద్ధలతో స్వామివారికి పూజలు చేస్తున్నారు. నిత్య కళ్యాణంలో ప్రత్యక్షంగా పాల్గొనేవారి సంఖ్య పెరుగుతోంది. వెయ్యి రూపాయలు చెల్లించి ఎవరైనా ... ఉదయం 9:30 గంటలకు ప్రారంభమయ్యే నిత్యకళ్యాణంలో పాల్గొనే వీలుంది. ఇవాళ శుక్రవారం శ్రీతాయార్ల సన్నిధిలో అర్చకులు, వేద పండితులు సహస్రనామార్చనం జరిపారు. ఆర్జిత సేవల్లో పరోక్షంగా పాల్గొనే భక్తులకు ఏరోజుకారోజు స్వామివారి ప్రసాదాన్ని అధికారులు రిజిస్టర్డ్ పోస్టులో పంపిస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

విజయవాడ కృష్ణాజిల్లా నందిగామ మండలం చందాపురం జాతీయ రహదారిపై తెల్లవారుజామున ద్విచక్ర వాహనం అతివేగంగా డివైడర్ ను ఢీకొంది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేసే వ్యక్తులు అక్కడకు అక్కడే మృతి చెందారు మృతులు తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్, రామాపురానికి చెందిన గోపి నాగరాజు లుగా గుర్తింపు వీరు ఫొటోగ్రాఫర్ హుజూర్నగర్ నుండి విజయవాడ వెళుతుండగా తెల్లవారుజామున నిద్రమత్తు, అతివేగం ఈ రెండు కారణాల వల్ల డివైడర్ ను ఢీకొన్న ట్లుగా సమాచారం విషయం తెలుసుకున్న ఎస్ఐ తాతాచార్యులు ఘటనా స్థలం వద్దకు చేరుకుని మృతదేహాలను నందిగామ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు

## కాంగ్రెస్ కు చిరు ఆశ



కాకినాడ, జూలై 2, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ లో విభజన తరువాత కాంగ్రెస్ పార్టీ వెంటిలేటర్ పై ఉంది. దీనికి తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఇచ్చిన తప్పుడు వ్యూహం కొంతైతే మరికొంత జగన్ చరిష్మా తో ఆ పార్టీ రెండు రాష్ట్రాల్లో దెబ్బయిపోవడం మరో కారణం అన్నది రాజకీయ విశ్లేషకుల మాట. ఇలా రెండింటికి చెడ్డ రేవడి గా మారిన కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ లో కొంత ఆశలు ఉన్నాయి. అక్కడ నాయకత్వానికి ఢోకా లేదు. కానీ అనైక్యంగా ఉన్న కాంగ్రెస్ బలాన్ని సంఘటితం చేసి నడిపే శక్తి ఇప్పటివరకు లేదనే చెప్పాలి. అయితే కొత్త అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వచ్చాకా కొంత జోష్ ఆ పార్టీ క్యాడర్ కి ఏర్పడింది. కానీ ఏపీ లో మాత్రం నానాటికి తీసికట్టు కాంగ్రెస్ పరిస్థితి అన్నట్లే ఉంది. తన సినీ చరిష్మా తో చిరంజీవి ప్రజారాజ్యం పార్టీని స్థాపించి అది వర్క్ అవుట్ కాకపోవడంతో కాంగ్రెస్ లో విలీనం చేసి రాజ్యసభ సభ్యుడై కేంద్రమంత్రి అయ్యారు. ఎప్పుడైతే కాంగ్రెస్ అశాస్త్రీయ విభజనకు పాల్పడి ఏపీ లో చులకన అయ్యిందో నాటి నుంచి ఆ పార్టీ కి రాజీనామా చేయకుండా ఒక్కసారిగా సైలెంట్ అయిపోయారు మెగాస్టార్. పోనీ అలా అని ఆయన యాక్టివిటీస్ ఏమి లేవా అంటే సినిమా షూటింగ్స్ లో బిజీగా ఉంటూ కరోనా కాలంలో సినీ కళాకారులను పెద్ద ఎత్తునే నిత్యావసరాలు ఇచ్చి ఆదుకున్నారు. వారికి వ్యాక్సినేషన్ డ్రైవ్ సైతం నిర్వహించారు. అంతేకాదు రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆక్సిజన్ బ్యాంక్ లు సైతం నెలకొల్పారు. ఇలా సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా ఉన్నా కాంగ్రెస్ పార్టీ యాక్టివిటీ కి మాత్రం చిరంజీవి దూరంగానే ఉన్నారు. ఇలా ఉన్న చిరంజీవి తమ పార్టీలోనే ఉన్నారు అంటూ ఏపీ పిసిసి అధ్యక్షుడు శైలజానాథ్ ప్రకటించుకున్నారు అంటే హస్తం దీనపరిస్థితి చెప్పక చెప్పినట్లు అయ్యింది. చిరంజీవి కాంగ్రెస్ వ్యతిరేక పనులే ఎక్కువ చేస్తున్నారు. ఏపీ సిఎం ఇంటికి వెళ్ళి డిన్నర్ చేసి రావడం ఆ తరువాత ఎప్పుడు వీలుంటే అప్పుడు జగన్ చర్యలను ప్రశంసించడం రొటీన్ గా చేస్తూ వస్తున్నారు. ఇటీవలే జగన్ చేపట్టిన రికార్డ్ స్థాయి వ్యాక్సినేషన్ ను సైతం మెచ్చుకున్నారు మెగాస్టార్ చిరంజీవి. ఇలాంటి స్టేట్మెంట్స్ ఇస్తున్న చిరంజీవి కాంగ్రెస్ కి ఎలా దగ్గరగా ఉన్నారో ఎవరికి అర్థం కాని విషయం అనే చెప్పాలి. మరో పక్క చిరు చర్యలు అటు తమ్ముడు పవన్ కళ్యాణ్ జనసేన కు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. కాపు ఓటు బ్యాంక్ గంపగుత్తగా తమకే ఉంటుందనుకుంటున్న జనసేనకు చిరంజీవి పరోక్షంగా చెక్ పెడుతున్నారనే ఆందోళన సైతం ఆ పార్టీ క్యాడర్ ను వెంటాడుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో కాంగ్రెస్ లో ఇంకా తగ్గని ఆశకు చిరు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

## జనసేనలో సీటుకు ఫుల్ డిమాండ్

జనసేన

రాజమండ్రి, జూలై 2, (న్యూస్ పల్స్)2019 ఎన్నికల్లో జనసేన సాధించిన గొప్ప గురించి చెప్పుకోవడానికి ఏదైనా మిగిలి ఉందంటే అది రాజోలు నియోజకవర్గం. అయితే పవన్‌కు ఆ ఆనందం కొద్ది రోజులే మిగిలి ఉంది. జనసేన ఏకైక ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు వైసీపీ చెంత చేరిపోయారు. ఆయన తన కుమారుడిని కూడా జగన్ సమక్షంలో వైసీపీలో చేర్పించేశారు. ఇక్కడి వరకు బాగానే ఉంది. ఇప్పుడు రాపాక వరప్రసాద్ వైసీపీలో ఉండడంతో రాజోలు వైసీపీ రాజకీయం భ్రష్టు పట్టిపోయింది. ఎప్పుడు అయితే రాపాక వైసీపీలోకి వెళ్లాడో అప్పుడే రాజోలు వైసీపీ మూడుగా చీలిపోయింది. స్థానిక క్షత్రియులు అందరూ వైసీపీ నేతలుగా చెలామణి అవుతున్నారు. వీరంతా రాపాక వరప్రసాద్ తమ చెప్పు చేతల్లో ఉంటాడని ఆయనకే సపోర్ట్ చేస్తున్నారు. ఇక ఇక్కడ వైసీపీ నుంచి గత రెండు ఎన్నికల్లో పోటీ చేసి ఓడిన బొంతు రాజేశ్వరరావు మరో వర్గంగా ఉంటే.. మాల కార్పోరేషన్ చైర్మన్ పెదపాటి అమ్మాజీ మరో వర్గంగా ఉంటున్నారు. ఈ ముగ్గురిలో ఎవరు అన్నా మిగిలిన ఇద్దరికి పడట్లేదు. జగన్ ఇప్పుడు రాపాక వరప్రసాద్ ను పార్టీలో చేర్చుకోవడంతో రాజోలు వైసీపీ రాజకీయం కంపు కంపు అయిపోయింది. కేడర్ మూడు ముక్కలైంది. పాత కేడర్ రాపాక వరప్రసాద్ ను పక్కన పెడుతోంది. జంపింగ్ నేతలు అందరూ బొంతును ఎప్పుడో సైడ్ చేసేశారు. అసలు అమ్మాజీ వెనక ఎవరు ఉన్నారో ? కూడా అర్థం కావట్లేదు. ఈ లోగా అమలాపురం ఎంపీ చింతా అనూరాధ సైతం తాను కూడా ఇక్కడ ఉన్నానని ప్రూవ్ చేసుకునేందుకో లేదా వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేయాలన్న కోరికో కాని.. ఆమె హడావిడి మామూలుగా లేదు. వచ్చే ఎన్నికల్లో రాపాక వరప్రసాద్ కు సీటు ఇస్తే వైసీపీ వాళ్లే ఆయన్ను ఓడిస్తామని శపథాలు చేస్తున్నారు. ఇక రాజోలు వైసీపీ తలనొప్పి ఇలా ఉంటే పవన్‌కు కూడా ఇక్కడ వాతావరణం తలనొప్పిగా మారింది. రాపాక వెళ్లిపోయాక ఇక్కడ జనసేనకు బలమైన నాయకులు లేకుండా పోయారు. అయితే జనసేన కేడర్ బలంగా ఉంది. సర్పంచ్ ఎన్నికల్లో ఇక్కడ జనసేన సానుభూతిపరులు ఏకంగా 30 + పంచాయతీల్లో గెలిచారు. అయితే ఇక్కడ జనసేన కేడర్ అంతా వచ్చే ఎన్నికల్లో రాపాక వరప్రసాద్ ను ఎలాగైనా ఓడించాలని కసితో ఉన్నారు. జనసేనలో ఉన్న కాపు సామాజిక వర్గంతో పాటు పవన్ అభిమానులు కూడా రాపాకను గట్టిగా టార్గెట్ చేస్తున్నారు. ఎన్నికల్లో జనసేన ఏపీలోనే గెలిచిన ఏకైక సీటు కావడం.. ఇక్కడ పార్టీకి బలం ఉండడంతో టీడీపీ కన్నా కూడా జనసేన నుంచి పోటీ చేసేందుకు అప్పుడే ఐదారుగురు నేతలు క్యూలో ఉన్నారు. ఓ ప్రముఖ న్యాయవాదితో పాటు ఒకరిద్దరు ప్రభుత్వ అధికారులు సీటుపై హామీ ఇస్తారా ? వేం ఇప్పుడే రంగంలోకి దిగుతామని చెపుతున్నారట. వైసీపీలో లుకలుకలు క్యాష్ చేసుకుంటే మళ్లీ ఇక్కడ జనసేనే గెలుస్తుందన్నది వారి లెక్క..! అయితే ఇప్పుడు జనసేన ఇన్‌చార్జ్ పగ్గాల కోసం పోటీ పడుతోన్న వారిలో అప్పుడే గొడవలు మొదలయ్యాయి. వీటిని సెట్ చేసేంత సీన్ పవన్‌కు లేదు. జనసేనకు లేక లేక ఈ ఒక్క నియోజకవర్గంలో పట్టు ఉంటే ఇక్కడ లుకలుకలు.. పవన్‌కు వీటిని పట్టించుకునే తీరిక లేకపోవడం ఆ పార్టీ బ్యాడ్ లక్ ?

## దేవీపట్నం లో మంత్రి అవంతి పర్యటన

రాజమండ్రిజూలై 2, (న్యూస్ పల్స్) తూర్పు గోదావరి జిల్లా దేవీపట్నం మండలం లో గొందూరు గండి పోశమ్మ అమ్మవారిని దర్శించుకుని అనంతరం గోదావరిలో పర్యాటక శాఖ మంత్రి అవంతి శ్రీనివాస్ గోదావరిలో బోటు ప్రయాణం చేశారు. రాజానగరం నియోజకవర్గం ఎమ్మెల్యే కాపు కార్పొరేషన్ చైర్మన్ జక్కంపూడి రాజా, పార్లమెంట్ ఎంపీ మార్గం భరత్, రంపచోడవరం నియోజకవర్గం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రవీణ్ ఆదిత్య, సబ్ కలెక్టర్ కట్టా సింహాచలం, రంపచోడవరం ఏఎస్పీ బిందు మాధవ్, దేవిపట్నం తాసిల్దార్ ఎం వీర్రాజు, వైయస్సార్ పార్టీ నాయకులు గండి పోశమ్మ చైర్మెన్ సట్టా సత్తిబాబు, కందుల బాబ్జి, సరసం పెద్దబాబు, మట్ట రాంబాబు, మంటూరు ప్రసాదు, కోమలి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పదవుల కోసం తండ్రి, కొడుకులు...చూపులు

విశాఖపట్టణం, జూలై 2, (న్యూస్ పల్స్)ఒకే కుటుంబంలో ఇద్దరు నాయకులు పోటీ పడడం పెద్ద విశేషమేమీ కాదు. అన్నదమ్ములు, బాబాయ్ అబ్బాయి, మామా అల్లుళ్ళు ఇలా చాలా బంధాలను ఇప్పటిదాకా అంతా చూశారు. అయితే చిత్రంగా ఒకే ఇంట్లో తండ్రీ కొడుకులు పదవుల కోసం పరుగులు పెడుతున్నారు. ఈ ఇద్దరికీ ఆ పోటీ పెట్టింది జగన్ అంటే కూడా ఆశ్చర్యంగా ఉంటుంది. మీరే ఎవరో తేల్చుకుంటే పదవి ఒకటి ఇవ్వడం గ్యారంటీ అని వైసీపీ అధినాయకత్వం అంటున్నట్లుగా చెబుతున్నారు. ఇంతకీ ఆ తండ్రీ కొడుకులు ఎవరూ అంటే విశాఖలో రాజకీయంగా ఢక్కా మక్కీలు తిన్న మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, ఆయన కుమారుడు దాడి రత్నాకర్. ఎనిమిదేళ్ళ క్రితం అంటే 2013లోనే ఎమ్మెల్సీ పదవీకాలం పూర్తి కావడంతో అధికార హోదాకు దూరమైన దాడి వీరభద్రరావుకు మళ్ళీ పెద్దల సభలో కూర్చోవాలని ఉందిట. అది ఆయన పంతం కూడా. తనను చంద్రబాబు పక్కన పెట్టి రెండు సార్లు యనమల రామకృష్ణుడికి ఆ పదవి ఇచ్చారు. తానేమి తక్కువ తిన్నానా అన్నది దాడి వీరభద్రరావు ఆలోచన. పైగా తాను ఎలాగైనా మళ్ళీ ఆ పదవిని దక్కించుకుని బాబు ముందు నిలబడాలన్న పట్టుదల కూడా ఆయనకు ఉంది. అందుకే ఆయన జగన్ వైపు వచ్చారు. గత ఎన్నికల్లో వైసీపీ విజయానికి గట్టిగా కృషి చేశారు. ఇక ఆయన కుమారుడు, రాజకీయ వారసుడు దాడి రత్నాకర్ కి కూడా పదవుల మీద ఆశ ఉంది. తండ్రితో సంబంధం లేకుండా తన సేవలకు గుర్తింపును ఆయన కోరుకుంటున్నాడు. విశాఖలో అత్యంత ప్రతిష్టాత్మకమైన డీసీసీబీ చైర్మన్ పదవిని దక్కించుకోవడానికి దాడి రత్నాకర్ పావులు కదుపుతున్నారు. ఈ పదవిలో ఇప్పటిదాకా ఉన్న యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు రాజు కుమారుడు సుకుమార వర్మ కూడా మరో సారి ట్రై చేస్తున్నారు. అయితే ఆయన ఇప్పటికే రెండు సార్లు ఈ పదవిలో ఉన్నదువల్ల ఈసారి మార్చి వేరే వారికి ఇవ్వాలని జగన్ ఆలోచన చేస్తున్నారుట. దాంతో తాను మాట ఇచ్చిన దాడి కుటుంబానికి ఆఫర్ ఇచ్చారని టాక్. కుమారుడు రత్నాకర్ కి ఆ పదవిని ఇచ్చి తండ్రి దాడి వీరభద్రరావు సేవలను పార్టీ కోసం వాడుకోవాలని జగన్ చూస్తున్నారుట. ఈ విషయంలో తేల్చుకోవాల్సింది దాడి వీరభద్రరావు ఫ్యామిలీయే అని అంటున్నారు. దాడి వీరభద్రరావుది నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితం. ఆయన అనేక పర్యాయాలు ఎమ్మెల్యేగా మంత్రిగా పదవులు అనుభవించారు. మరి కుమారుడి రాజకీయ భవిష్యత్తు దృష్ట్యా పెద్దాయన వెనక్కి తగ్గితే డీసీసీబీ చైర్మన్ గా దాడి రత్నాకర్ నియామకం ఖాయమే అంటున్నారు. అలా కాదు తాను ఎమ్మెల్సీగా ఉండాలని దాడి వీరభద్రరావు ఆశ పడితే మాత్రం డీసీసీబీ వేరే వారికి వెళ్ళిపోతుంది. అయితే బలమైన గవర సామాజికవర్గానికి వైసీపీలో పదవులు పెద్దగా దక్కలేదు అన్న కారణం చూపించి తండ్రీ కొడుకులు ఇద్దరూ కుర్చీలు కోరుకుంటున్నారు అంటున్నారు. కానీ అక్కడ ఉన్నది జగన్, పైగా ఆయన మాట ఇచ్చిన మేరకు దాడి ఫ్యామిలీకి న్యాయం చేస్తూనే అందరికీ కూడా సమాన అవకాశాలు ఇవ్వాలనుకుంటున్నారుట. మొత్తానికి ఈ తండ్రీ కొడుకుల రేసులో ఎవరిని పదవి వరిస్తుందో చూడాల్సిందే.

## డిజిటల్ మాల్ ఖాన్ ప్రారంభం

నర్సీపట్నం జూలై 2, (న్యూస్ పల్స్)డిజిటల్ విధానాలను అందిపుచ్చుకోవడంలో పోలీస్ శాఖ మరో అడుగు ముందుకేసింది. ఇప్పటికే మహిళల రక్షణ కోసం ప్రత్యేకంగా దిశ యాప్ ప్రవేశపెట్టగా తాజాగా పలు కేసుల్లో నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువులను భద్రపరిచే విషయమై డిజిటల్ టెక్నాలజీని వినియోగించ బోతోంది. దీనిని ఇప్పటికే ఉత్తరాది రాష్ట్రాల్లో అమలు చేస్తుండగా తాజాగా రాష్ట్రంలో నే తొలిసారిగా విశాఖ జిల్లాలోని నర్సీపట్నం మోడల్ పోలీస్టేషన్ నుంచి ఈ సేవలను రూరల్ యస్.పీ కృష్ణారావు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ కృష్ణారావు మాట్లాడుతూ పలు కేసుల్లో నిందితుల నుంచి స్వాధీన పరుచుకున్న వస్తువులను ఇంతవరకు సాధారణ పద్ధతిలో భద్రపరిచేవారమన్నారు. అయితే ప్రస్తుతం అమల్లోకి వచ్చిన ఈ - మల్ఖానా నూతన విధానం ద్వారా భద్ర పరిచే వస్తువులకు ప్రత్యేకంగా క్యూ ఆర్ కోడ్ ఇవ్వబడుతుందన్నారు. దీనివల్ల ఆయా సమయాల్లో న్యాయ స్థానాల్లో హియరింగ్ వచ్చే కేసులకు సంబందించి అప్పట్లో స్వాధీనం చేసుకున్న వస్తువులను అందించేందుకు సులభతరం అవుతుందన్నారు. దీనిని నెలరోజుల పాటు నర్సీపట్నంలో పరిశీలించి వచ్చిన ప్రతిఫలాల ఆధారంగా విశాఖ రూరల్ జిల్లాలో అనకాపల్లిలో కూడా ఏర్పాటు చేస్థామని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భవిష్యత్తులో దీన్ని రాష్ట్ర మంతటా విస్తరించేందుకు చర్యలు తీసుకుంటామని రూరల్ యస్.పీ కృష్ణారావు తెలియచేశారు. అనంతరం విలేఖరులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ తీగెలమెట్ట ఎంకౌంటర్ కు నిరసనగా మావోయిస్టులు ఈ రోజు తలపెట్టిన బంద్ విఫలమైందని వారికి ప్రజలు ఎవరూ సహకరించ లేదని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని, మావోయిస్టులు ఎవరైనా స్వచ్ఛందంగా లొంగిపోయినట్లయితే వారి మనుగడకు ప్రభుత్వం తరపున అన్ని విధములా వారికి సహాయ సహకారాలు అందిస్తామని తెలియచేశారు. కార్యక్రమంలో నర్సీపట్నం ఏ.ఎస్పీ తుహిన్ సిన్హా, పట్టణ సీఐ స్వామి నాయుడు ,రూరల్ సి.ఐ శ్రీనివాసరావు ఎస్. ఐ లు,పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జంపు జిలానీలపై చర్యలు

**రేవంత్ రెడ్డి**

హైదరాబాద్ జూలై 2, (న్యూస్ పల్స్)మణికొండలో ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ ను తెలంగాణ పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసారు. రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో గెలిచి అమ్ముడుపోయిన ఎమ్మెల్యేలను రాళ్లతో కొట్టి చంపాలి. అలా కొట్టడంలో నేను ముందుంటా. కార్యకర్తలు కష్టపడి గెలిపిస్తే అధికార పార్టీకి అమ్ముడుపోయె సన్నాసులకు సిగ్గు ఉండాలని మండిపడ్డారు. పార్టీ పిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యే లపై చర్యలు తీసుకోకుంటే అవసరమైతే స్పీకర్ పై చర్యలకు కూడా న్యాయ స్థానాన్ని ఆశ్రయిస్తామని అన్నారు. కేసీఆర్ పశువులను కొన్నట్లుగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కొన్నాడు. అమ్ముడుపోయిన ఎమ్మెల్యేలు పదవికి రాజీనామ చేసి దమ్ముంటే ఎన్నికలకు రావాలి. తెలంగాణ ఇచ్చింది సోనియా.. ప్రజలకు సోనియాపై నమ్మకం ఉందిని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీపై ప్రజలకు నమ్మకం ఉంది. .వచ్చే ఎన్నికల్లో కెసిఆర్ కి ప్రజలు మంచి గునపాఠం చెప్తారని అన్నారు.

# దిశ....మహిళలకు ఒక మార్గదర్శి

తుగ్గలి జూలై 2, ( విభారె) మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టడానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పోలీసు అధికారులు దిశ యాప్ ను ఆచరణలోకి తీసుకొని వచ్చారని తుగ్గలి యస్.ఐ షామీర్ భాష తెలియజేశారు.ఫిబ్రవరి 2020 న రాష్ట్ర ప్రభుత్వం దిశ యాప్ ను ప్రారంభించిందని ఆయన తెలియజేశారు. శుక్రవారం రోజున మండల కేంద్రమైన తుగ్గలి లోని స్థానిక పోలీస్ స్టేషన్ నందు స్థానిక పోలీసు సిబ్బందితో మరియు గ్రామ మహిళా సచివాలయ కార్యదర్శులతో సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని దిశ యాప్ పై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్సై షామీర్ భాష మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు దిశ యాప్ పై గ్రామంలోని ప్రతి మహిళకు అవగాహన కల్పించాలని మహిళా పోలీస్ కార్యదర్శులకు ఎస్సై తెలియజేశారు.దిశ యాప్ ను ఇంటర్నెట్ ద్వారా ప్లేస్టోర్ లో డౌన్లోడ్ చేసుకోవాలని,దిశ యాప్ వినియోగానికి ఎటువంటి ఇంటర్నెట్ సౌకర్యం అవసరం లేదని ఆయన తెలియజేశారు.ప్రస్తుత పరిస్థితులలో మహిళలు ఏమైనా ఆపదలో ఉన్నప్పుడు దిశా యాప్ లో ఉండే సేవలను వినియోగించి తమను తాము రక్షించుకోవడం అని ఎస్.ఐ తెలియజేశారు.మహిళలు ఏవైనా ఆపదలో ఉన్నప్పుడు దిశ యాప్లోని ఎస్.ఓ.ఎస్ (సేవ్ అవర్ సిస్టర్స్) బటన్ను నొక్కడం ద్వారా సమిపంలోని పోలీస్ స్టేషన్కు సమాచారం వెళ్తుంది,ఎస్.ఓ ఎస్ బటన్ ను నొక్కినప్పుడు సంఘటనా స్థలం వద్ద వీడియో,ఆడియో చిత్రీకరణ ఆటోమేటిక్ గా జరుగుతుందని, అనంతరం లొకేషన్ ఆధారంగా పోలీసులు త్వరగా సంఘటనా స్థలానికి చేరుకొని ఆపదలను అడ్డుకుంటారని ఎస్.ఐ తెలియజేశారు.చెవిటి మరియు మూగ మహిళల సౌకర్యార్థం దిశ యాప్ ను ఓపెన్ చేసి గట్టిగా మూడు సార్లు కుదపడం ద్వారా కూడా సంబంధిత సమీప పోలీస్ స్టేషన్కు సమాచారం వెళ్తుందని ఎస్ఐ తెలియజేశారు.దిశ యాప్ ద్వారా మహిళలకు ఎంతో ఆత్మ విశ్వాసం పెరుగుతుందని,దిశా యాప్ ద్వారా అత్యవసరమైన మెడికల్,ఫైర్ తదితర వంటి సేవలను కూడా ఈ యాప్ ద్వారా వినియోగించుకోవచ్చని ఎస్సై షామీర్ భాష తెలియజేశారు.కావున మహిళలు దిశ యాప్ ను వినియోగిస్తూ,మరో నలుగురు మహిళలకు సమాచారం అందించాలని ఎస్ఐ షామీర్ భాష తెలియజేశారు.దిశ యాప్ ద్వారా కేసు నమోదైతే నిందితుడిపై 14 రోజుల్లో విచారణ నిర్వహించి,21 రోజులలోపు శిక్షను ఖరారు చేస్తారని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ మాధవ స్వామి,తుగ్గలి పోలీస్ సిబ్బంది, మహిళా పోలీసులు సుశీల, ఆదిలక్ష్మి మరియు గ్రామ మహిళా సచివాలయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీలపై అక్రమ కేసులు బనాయించిన ఎస్సై పై చట్టరీత్య చర్య తీసుకోవాలి

### బహుజన సమాజ్ వాది పార్టీ డిమాండ్

నెల్లూరు జూలై 2, ( విభారె) నెల్లూరు జిల్లా, దగదర్తి మండలం, కాట్రాయపాడు గ్రామ అరుంధతీయులపై అక్రమ కేసులు బనాయించిన స్థానిక మండల సబ్ ఇన్స్పెక్టర్ వేణుగోపాల్ పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బహుజన సమాజ్ పార్టీ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. నెల్లూరు నగరంలోని స్థానిక ప్రెస్ క్లబ్ నందు శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బి ఎస్ పి జిల్లా అధ్యక్షులు వాకాటి శ్రీనివాసులు మాట్లాడుతూ రేషన్ బియ్యం పంపిణీ విషయమై బంధువుల మధ్య ఫిబ్రవరిలో జరిగిన తగాదా విషయమై విచారణ నెపంతో గుర్రం చిన్న చెంచయ్య ఇంట్లోకి ఈ నెల 24న ఎస్సై వేణుగోపాల్, కానిస్టేబుల్స్ కార్తీక్, సునీల్ అక్రమంగా చొరబడి, ఆ సమయంలో ఇంట్లో ఉన్న చిన్న చెంచయ్య ను చొక్కా పట్టుకొని కొట్టుకుంటూ జీపు దగ్గరకి తీసుకొని వెళు తుండగా, చెంచయ్య భార్య, తండ్రి (80), కూతురు(13) అడ్డుపడి ఎందుకు లాక్కొని వెళ్తున్నారు, ఎందుకు కొడుతున్నారని ప్రశ్నించడంతో ఎస్సై, కానిస్టేబుల్స్ ముసలి ముతక, చిన్నాపెద్ద ,ఆడ మగ తేడా లేకుండా అడ్డువచ్చిన అందరిని కొట్టడం సరికాదని ఎస్ ఐ నియంత చర్యలను ఖండించారు. ఈ విషయమై చిన్న చెంచయ్య చిన్నాన్న కొడుకు గుర్రం రవి బాబు( సాఫ్ట్వేర్ ఇంజనీర్) వీళ్లను రేపు 25 మంగళవారం స్టేషన్కు తీసుకు వస్తానని చెప్పడంతో పోలీసులు , రవి బాబు తోపాటు అక్కడ ఉన్న మరో కొంత మంది యువత పేర్లు రాసుకుని వెళ్లారని చెప్పారు. ఈ విషయమై 25 వ తేదీ మంగళవారం గుర్రం చెంచయ్యను తీసుకొని గుర్రం రవిబాబు మరికొంతమంది స్టేషన్ కు వెళ్లడం జరిగిందన్నారు. ఈ క్రమంలో తమ విధులకు ఆటంకం కలిగించారని ఆరోపణలతో 24న సోమవారం రాత్రి ఉద్దేశపూర్వకంగానే గుర్రం గుర్రం రవి బాబు తో పాటు మరో 6 మందిపై అక్రమ కేసులు బనాయించి నట్లు తెలిసిందన్నారు. ఈ సందర్భంగా గ్రామ యువకులు, సాఫ్ట్వేర్ ఇంజనీర్ గుర్రం రవిబాబు మాట్లాడుతూ ఎస్సై వేణుగోపాల్ తో తాను ఇంగ్లీషులో మాట్లాడటమే కాకుండా, తను ప్రశ్నించిన అందుకే కేసులు పురమాయించి నట్లు తెలిసిందన్నారు. దళితులు చదువుకోవడం, ఉద్యోగాలు చేయడం, ఇంగ్లీషులో మాట్లాడటం తప్పా అని అధికారులను ప్రశ్నించారు. ఎస్ఐ వేణుగోపాల్ స్థానిక రాజకీయ నాయకులు చెప్పినట్లుగా వారు కేసు కట్టమంటే కట్టడం, కట్టకపోవడం చేయడం అతనికి పరిపాటే అన్నారు. దళితులను చులకన భావంతో చూడడమే కాకుండా అక్రమ కేసులు బనాయించడం సమంజసం కాదన్నారు. ఎస్సై వేణుగోపాల పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు ఈ విషయమై సత్వరమే స్పందించి, విచారించి తగు న్యాయం చేయవలసిందిగా కోరారు. ఈ సమావేశంలో బహుజన సమాజ్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఘని, కావలి నియోజకవర్గ ఇన్చార్జి ఉదయ భాస్కర్, బాధితులు వెంకట రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా మద్యం తరలిస్తే కఠిన చర్యలు

### ఎస్సై మన్మథ విజయ్

కౌతాళం జూలై 2, ( విభారె) జిల్లా అధికారులు ఆదేశాలు మేరకు అనుమానిత వ్యక్తుల బెల్టుషాపులు నిర్వహిస్తున్న వారిపై నిఘా ఉంచామని స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్ ఐ మన్మథ విజయ్ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని నదిచగి గ్రామం వంక దగ్గర అనుమానాస్పద పరిస్థితిలో తిరుగుతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా వారి వద్దనుండి 4 బాక్సలు కర్ణాటక టెట్రా ప్యాకెట్ల స్వాధీనం చేసుకున్నాము.హల్వికు కు చెందిన విరేశ్, షాదిక్ ను అరెస్టు చేసినము వీరిపై కేసు నమోదు చేసి చేస్తున్నట్లు తెలిపారు. అక్రమంగా మద్యం తరలించి గ్రామంలో అమ్మితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో అశోక్ కుమార్, జయరాం హుస్సేన్ వలి రామాంజనేయులు,,పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# ప్రజా సమస్యలు పరిష్కరించడానికే పోలీస్ స్టేషన్లు...

### ఎస్సై షామీర్ భాష

తుగ్గలి జూలై 2, ( విభారె) ప్రజా సమస్యలు పరిష్కరించడానికే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఒక నిర్దిష్ట నియమ నిబంధనలను ఏర్పాటు చేసి ప్రజల కొరకు పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేశాయని తుగ్గలి ఎస్ఐ షామీర్ భాష తెలియజేశారు.శుక్రవారం రోజున విలేకరుల సమావేశంలో ఎస్సై మాట్లాడుతూ సమాజంలో ఏర్పడ్డ ఎటువంటి సమస్యలైనా పోలీస్ స్టేషన్ కు వచ్చి పోలీస్ అధికారుల దృష్టికి తీసుకొని వచ్చి సమస్యలను పరిష్కరించుకోవాలే గాని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ఎవరు ప్రోత్సహించరాదని ఆయన తెలియజేశారు.అదేవిధంగా గ్రామాలలో జరిగే అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా నిర్మూలించేలా ప్రజలు సహకరించాలని ఆయన తెలియజేశారు.గ్రామాలలో సారా,మట్కా,పేకాట మరియు బెట్టింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే తమకు సమాచారం ఇవ్వాలని,వారి పేర్లను గోప్యంగా ఉంచి సంఘ విద్రోహ శక్తులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఎటువంటి సమస్యలు ఉన్నా ప్రజలు ధైర్యంగా పోలీస్ స్టేషన్కు వచ్చి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన ప్రజలకు తెలియజేశారు.ప్రజల సమస్యల పరిష్కరించడానికి ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటానని ఎస్సై షామీర్ భాష తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తుగ్గలి పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జగనన్న కాలనీలు అంతా మోసం

కొవ్వూరుజూలై 2, ( విభారె) పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరు పట్టణంలో మాజీ మంత్రి కె.ఎస్ జవహర్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న కాలనీల పేరుతో పేద ప్రజలను పెద్ద ఎత్తున మోసం చేసే కార్యక్రమం సి.ఎం జగన్ మోహన్ రెడ్డి తీసుకున్నారని అన్నారు.సాక్ష్యాత్తు వై.సి.పి ఎమ్మెల్యే అవి కనీసం భార్య భర్తలు పడుకోవడానికి కూడా పనికి రావు అని చెప్పిన తరువాత కూడా కనీసం వాస్తవం గ్రహించకుండా ఈ రోజు అట్టహాసంగా శంఖు స్థాపనలు చేస్తున్నారు అని అన్నారు.కొవ్వూరు మరియు చుట్టు ప్రక్కల ప్రాంతాలలో ఇచ్చిన స్థలాలు వరదకు గానీ,వరద ముంపు గానీ వర్షం వచ్చిన గానీ పూర్తిగా మునిగిపోతాయని అన్నారు.ఎటువంటి స్థలాలను పేద ప్రజలకు అంటగట్టారు అని,ఈ రోజు శంఖుస్థాపనలు చేస్తుంటే ఎక్కడ చూసినా నీళ్ళు వున్నాయని అన్నారు.ఇప్పటికే 2సార్లు శంఖు స్థాపనలు చేశారు అని,ఇప్పటికే తయారు అయిన ఎన్టీర్ కాలనీలను పేద ప్రజలకు అందించకుండా ప్రభుత్వం జాప్యం చేస్తోంది అని,ఎన్టీర్ కాలనీ ఇళ్లను పేద ప్రజలకు త్వరగా అందించాలని తెలుగు దేశం పార్టీ తరుపున డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

# శ్రీశైలంలో విశ్వామిత్ర మఠంలో గుప్త నిధుల త్రవ్వకాలు

### ఆలస్యంగా వెలుగు చూసిన వైనం

శ్రీశైలం కర్నూలు జిల్లా శ్రీశైలంలో మహా క్షేత్రంలో గుప్త నిధుల కలకలం రేగింది ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన శ్రీశైలలోని మల్లమ్మ కన్నీరు ఆలయానికి వెనుక భాగాన ఉన్న ప్రాచీన విశ్వామిత్రు మఠంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపారు గుర్తు తెలియని దుండగులు విశ్వామిత్ర మఠం ఆవరణలో ఋషులు తపస్సు చేసే కుటీర నిర్మాణ గృహంలో నాలుగు అడుగుల వెడల్పు, నాలుగు అడుగుల లోతు తవ్వకాలు జరిపిన దుండగులు ముందువైపు తాళాలు వేసినవి వేసినట్టే ఉన్నా, వెనుక వైపు గోడను పగలగొట్టి,లోపల తవ్వకాలు జరిపిన దుండగులు త్రవ్వకాలు జరిపిన ప్రాంతం అటవీశాఖ ఆధీనంలోకి రావడంతో అటవీశాఖ అధికారులు త్రవ్వకాలు జరిపిన స్థలాన్ని పరిశీలించిన తరువాత పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు

# గ్యాస్ ధరలను తగ్గించాలి

ఏలూరుజూలై 2, ( విభారె) పెంచిన వంట గ్యాస్ ధరలను తగ్గించాలని సిపిఎం ఏలూరు నగర కమిటీ ఆధ్వర్యంలో లో ఏ లురు జ్యూట్ మిల్ సెంటర్ వద్ద శుక్రవారం ఉదయం సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి పి కిషోర్ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా ప్రజలు మహమ్మారి వల్ల ఉపాధి లేక ఆదాయాలు కోల్పోయి, ఆర్థికంగా సతమతమవుతున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు ఇటువంటి తరుణంలో కూడా ప్రజల పై ఏమాత్రం కనికరం లేకుండా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వంట గ్యాస్ ధర 25.50 రూపాయలు పెంచడం అంటే మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు అయిందన్నారు. బిజెపి ప్రభుత్వం గడిచిన ఏడు మాసాల కాలంలో ఒక్క గ్యాస్ పై నే 240 రూపాయలు పెంచిందని గుర్తు చేశారు. ఇన్ని సార్లు గ్యాస్ ధరలు పెంచుతున్నా కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చే గాస్ సబ్సిడీ మాత్రం పెంచడం లేదని అన్నారు. అసలు చాలా మంది ప్రజానీకానికి తమ బ్యాంకు ఖాతాల్లో గ్యాస్ సబ్సిడీ డబ్బులు పడటం లేదని అన్నారు. కేవలం 10, 15 రూపాయలు మాత్రమే సబ్సిడీ రూపంలో కొద్ది మంది ప్రజలకు వస్తుందని గుర్తు చేశారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి గ్యాస్, పెట్రోలు డీజిల్ ధరలు పెంచుతూనే ఉన్నదని అన్నారు. దేశంలో ఆయిల్, గ్యాస్ కంపెనీల గుప్పిట్లో పెట్టుకొన్న రిలయన్స్ అంబానీ, గౌతమ్ అదానీ వంటి బడా పెట్టుబడిదారులకు కరోనా ఈ సమయంలో కూడా లాభాలు పది రెట్లు పెరిగాయన అన్నారు. అంటే వారి లాభాలు పెరగడానికి కారణం ప్రభుత్వం ప్రజలపై ఈ విధంగా ధరలు పెంచటం అని అన్నారు. కేంద్రంలో బిజెపి ఎప్రభుత్వం పేదలను కొట్టి , పెద్దలకు పెడుతుందని విమర్శించారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల వల్ల అన్ని రకాల నిత్యావసర సరుకులు ధరలు కూడా ఆకాశాన్ని అంటుతున్నాయని అన్నారు. బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ఈ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలంతా వివిధ రూపాల్లో నిరసన లు తెలపాలి అని అన్నారు.

వరుసగా రెండోసారి దేశ ప్రజలు బీజేపీకి అధికారం కట్టబెడితే, బిజెపి ఆ ప్రజల కోసం కాకుండా దేశంలో కార్పొరేట్ సంస్థలు పెట్టుబడిదారుల కోసం

# జాతీయ రహదారి పై ప్రమాదం, ఇద్దరు మృతి

విజయవాడ జూలై 2, ( విభారె)నందిగామ బైపాస్ రోడ్డు లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. ద్వీచక్ర వాహనం రోడ్డు డివైడర్ ను ఢీకొంది. దాంతో వాహనం పై ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు అక్కడిక్కడే మృతి చెందారు. మృతి చెందిన వారు తెలంగాణ రాష్ట్రం హుజూర్ నగర్ గ్రామానికి చెందిన దేవరశెట్టి నాగరాజు (25), పత్తిపాటి గోపి (23) అను ఫొటోగ్రాఫర్ లుగా గుర్తించారు. వీరు హుజూర్ నగర్ నుండి విజయవాడ వస్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. అతి వేగంగా ద్వీచక్ర వాహనం నడపటమే ఈ ప్రమాదానికి కారణని స్థానికులు అంటున్నారు

# 'కింగ్' దర్శకుడితో యూత్ కింగ్ మైత్రీ కుదురుతోందా..?



యూత్ కింగ్ అఖిల్ అక్కినేని సాలిడ్ హిట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం 'బొమ్మరిల్లు' భాస్కర్ దర్శకత్వంలో "మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్" అనే యూత్ ఫుల్ ఎంటర్టైనర్ లో నటిస్తున్నాడు. అల్లు అరవింద్ సమర్పణలో జీఏ2 పిక్చర్స్ బ్యానర్ పై బన్నీ వాస్ - వాసు వర్మ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కరోనా కారణంగా ఈ సినిమా విడుదల వాయిదా పడింది. ఇక సురేందర్ రెడ్డి దర్శకత్వంలో "ఏజెంట్" అనే స్టైలిష్ యాక్షన్ థ్రిల్లర్ లో నటిస్తున్నారు అఖిల్. ఏకే ఎంటర్టైన్మెంట్స్ మరియు సరెండర్2సినిమా బ్యానర్స్ పై రామబ్రహ్మం సుంకర - సురేందర్ రెడ్డి సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జులై నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. ఈ క్రమంలో అక్కినేని అందగాడు మరో ప్రాజెక్ట్ కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడని ఫిలిం సర్కిల్స్ లో టాక్ వినిపిస్తోంది.టాలీవుడ్ లో స్టార్ హీరోలందరరితో సినిమాలు లైన్ లో పెడుతున్న మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ.. అఖిల్ అక్కినేని తో ఓ సినిమా ప్లాన్ చేస్తున్నారట. ఇప్పటికే దీని కోసం అఖిల్ కు అడ్వాన్స్ కూడా ఇచ్చారట. ఈ నేపథ్యంలో యంగ్ హీరో కోసం ఓ రొమాంటిక్ అండ్ యాక్షన్ ఎంటర్టైనింగ్ స్క్రిప్ట్ రెడీ చేయాల్సిందిగా దర్శకుడు శ్రీను వైట్ల కు మైత్రీ టీమ్ అడ్వాన్స్ ఇచ్చారట. ఇప్పుడు 'దూకుడు' డైరెక్టర్ ఓ స్క్రిప్ట్ రెడీ చేసి మేకర్స్ కు వినిపించారని.. త్వరలోనే అఖిల్ కు నేరేట్ చేస్తారని టాక్ వినిపిస్తోంది. యువ హీరోకి స్టోరీ నచ్చితే వీలైనంత త్వరగా ఈ ప్రాజెక్ట్ సెట్స్ పైకి వెళ్తుందని అంటున్నారు. శ్రీనువైట్ల గతంలో అక్కినేని నాగార్జున తో 'కింగ్' వంటి సూపర్ హిట్ అందించాడు. ఈ క్రమంలో ఇప్పుడు యూత్ కింగ్ తో సినిమా చేసేది నిజమో కాదో తెలియాలంటే ఇంకొన్నాళ్లు ఆగాల్సిందే. ఇకపోతే నాగ్ - అఖిల్ కాంబోలో మల్టీస్టారర్ చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. సరైన స్క్రిప్ట్ - డైరెక్టర్ సెట్ అయితే అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్ లోనే సినిమా రూపొందనుంది.

# స్టార్ డైరెక్టర్ కు నో చెప్పిన ఫేడ్ ఔట్ హీరోయిన్

టాలీవుడ్ లో ప్రస్తుతం ఆయన ఒక స్టార్ డైరెక్టర్. స్టార్ హీరోలతో వరుస సినిమాలు చేస్తూ ఇప్పటి వరకు ఫ్లాప్ లేకుండా దూసుకు పోతున్న ఆయన ఒక లేడీ ఓరియంటెడ్ సినిమా చేయాలనుకున్నాడు. ఆ స్టార్ డైరెక్టర్ ఇటీవల టాలీవుడ్ మరియు కోలీవుడ్ లో సీనియర్ మోస్ట్ స్టార్ హీరోయిన్ కు కథ చెప్పాడట. ఆమె ఒకప్పుడు టాలీవుడ్ మరియు కోలీవుడ్ లోనే కాకుండా ఇతర భాషల్లో కూడా స్టార్స్ సరసన సూపర్ స్టార్స్ సరసన నటించింది. కాని ఈమద్య మాత్రం



ఆమెకు ఆఫర్లు తగ్గాయి. ముఖ్యంగా తెలుగు లో ఆమె నటించి చాలా కాలమే అయ్యింది.తమిళంలో అడపాదడపా చిన్నా చితక సినిమాలు చేసుకుంటూ వస్తున్న ఆ సీనియర్ స్టార్ హీరోయిన్ కు మన స్టార్ డైరెక్టర్ కథ చెప్పాడు. సాదారణంగా మరే హీరోయిన్ అయినా ఆయన కథ చెప్పకుండానే సినిమా అంటే ఎగిరి గంతేస్తారు. ఆయన స్టార్ డమ్.. మరియు ఆయన సక్సెస్ రేటు అంతగా ఉంది. అలాంటిది ఈ హీరోయిన్ మాత్రం ఆయన చెప్పిన కథ విషయంలో అసంతృప్తి వ్యక్తం చేయడంతో పాటు ఇలాంటి స్క్రిప్ట్ లు తనకు వర్కౌట్ అవ్వవు అంటూ చెప్పేసిందట. ఆ సీనియర్ హీరోయిన్ నిర్ణయంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.అసలే ఫేడ్ ఔట్ అవుతున్న ఆమెకు ఈ అవకాశం బంగారం లాంటిది. అలాంటి ఛాన్స్ ను వదిలేసిన ఆమె ఇక కెరీర్ పై ఆశలు వదులుకున్నట్లేనా అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. దాదాపుగా రెండు దశాబ్దాలుగా హీరోయిన్ గా కొనసాగుతున్న ఆమె తెలుగు లో మంచి సినిమా ను చేయాలని కోరుకుంటుందట. కాని స్టార్ దర్శకుడు చెప్పిన స్క్రిప్ట్ కు మాత్రం నో చెప్పింది. ఆ దర్శకుడు ఆమెను మించిన ముద్దుగుమ్మను వెదికే పనిలో పడ్డాడు. ఒక వేళ ఆ సినిమా హిట్ అయితే ఆ హీరోయిన్ తల ఎక్కడ పెట్టుకుంటుందో మరి..!

# 'ఏకే' రీమేక్ లో పవన్ కళ్యాణ్ – రానా భీభత్సం చేయనున్నారా..??

ఈ మధ్యకాలంలో టాలీవుడ్ ఇండస్ట్రీ మేకర్స్ మలయాళం సినిమాలను రీమేక్ చేసేందుకు ఎక్కువగా ఇంటరెస్ట్ చూపిస్తున్నట్లు అనిపిస్తుంది. ఎందుకంటే ఒకటి రెండు సినిమాలంటే సరే చేస్తున్నారు అనుకోవచ్చు. కానీ మలయాళంలో తమిళంలో ఏ సినిమా బ్లాక్ బస్టర్ అయినా టాలీవుడ్ మేకర్స్ వెంటనే రీమేక్ హక్కులు దక్కించుకున్నాం అనేసి ప్రకటిస్తున్నారు. అంటే రీమేక్స్ తప్ప ఆ రేంజి మూవీస్ తెలుగులో నేరుగా రావా అంటూ సోషల్ మీడియాలో సందేహాలు



వ్యక్తం అవుతున్నాయి. ప్రస్తుతం టాలీవుడ్ ఇండస్ట్రీలో మలయాళం నుండి చిన్న పెద్ద కలిపి చాలా సినిమాలే తెరకెక్కుతున్నాయి.ప్రస్తుతం మేకింగ్ దశలోనే పది వరకు సినిమాలున్నాయని సమాచారం. అందులోను స్టార్ హీరోలు కూడా రీమేక్స్ బాటే పట్టడం ఆశ్చర్యం కలుగుతుంది. ఎందుకంటే ఓ మెగాస్టార్.. ఓ వెంకీ.. ఇలా ఎందరో హీరోలు రీమేక్స్ బాటపడుతున్నారు. అందులో ఒకరు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్. పవన్ – దగ్గుబాటి రానా కాంబినేషన్ లో ప్రస్తుతం 'అయ్యప్పనుమ్ కోషియం' రీమేక్ అవుతోంది. గతేడాది రిలీజ్ అయినటువంటి ఈ చిత్రం మలయాళంలో బాక్సఫీస్ రికార్డు క్రియేట్ చేసింది. అయితే ఒరిజినల్ లో పృథ్వీరాజ్ సుకుమారన్.. బిజు మీనన్ ప్రధానపాత్రల్లో నటించారు. ప్రస్తుతం తెలుగులో పవన్ కళ్యాణ్ – రానా కలిసి తెరకెక్కుతోంది.అయితే మలయాళంలో ఈ సినిమాలో మంచి ఫైట్స్ కూడా ఉంటాయి. మన తెలుగు నేటివిటీకి తగ్గట్టుగా మేకర్స్ ఈ స్క్రిప్ట్ రెడీ చేశారు. సాగర్ చంద్ర దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం గురించి తాజాగా సోషల్ మీడియాలో మరో పుకారు వైరల్ అవుతోంది. అదేంటంటే.. ఈ చిత్రంలో దాదాపు నాలుగు ఫైట్స్ ఉన్నట్లు తెలుస్తుంది. అయితే ఇద్దరూ వ్యక్తుల పర్సనల్ ఇగోస్ ద్వారా వారి కుటుంబాలు ఎలాంటి బాధలను ఎదుర్కొంటాయి అనేది చాలా ఎమోషనల్ గా ఉండబోతుందని సమాచారం. సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై నిర్మిస్తున్న ఈ చిత్రానికి అగ్రదర్శకుడు త్రివిక్రమ్ మాటలు అందిస్తున్నాడు. ప్రస్తుతం ఈ సినిమా పై ప్రేక్షకులలో భారీ అంచనాలు నెలకొన్నాయి.

# బాలీవుడ్ డెబ్యూ కోసం అక్కినేని హీరో ప్రీ-ప్లాన్..!

అక్కినేని హీరో నాగచైతన్య ఇటీవలే 'థాంక్యూ' మూవీ మెయిన్ షెడ్యూల్ పూర్తి చేసిన సంగతి తెలిసిందే. ఈ చిత్రం లాస్ట్ షెడ్యూల్ హైదరాబాద్ లోనే జరగనుంది. ఈ షెడ్యూల్ తో థాంక్యూ సినిమా మొత్తం షూటింగ్ ముగిసినట్లే అవుతుంది. మనం చిత్రంతో అక్కినేని ఫ్యామిలీకి మెమోరబుల్ హిట్ అందించిన విక్రమ్ కుమార్ ఈ థాంక్యూ మూవీని తెరకెక్కిస్తున్నాడు. ప్రొడ్యూసర్ దిల్ రాజు ఈ మూవీని నిర్మిస్తున్నాడు. అయితే హీరో నాగచైతన్య వీలైనంత త్వరగా థాంక్యూ షూటింగ్ పూర్తిచేయాలని చూస్తున్నాడు. వెంటనే తాను నటిస్తున్న బాలీవుడ్ డెబ్యూ ఫిల్మ్ 'లాల్ సింగ్ చద్దా' షూటింగ్ లో



పాల్గొనేందుకు రెడీ అవుతున్నాడు.ఆ చిత్రంలో బాలీవుడ్ మిస్టర్ పర్ఫెక్ట్ అమీర్ ఖాన్ లీడ్ రోల్ పోషిస్తుండగా.. నాగచైతన్య కీలకపాత్రలో నటిస్తున్నాడు. అయితే 'లాల్ సింగ్ చద్దా' మూవీలో నాగచైతన్య ఓ కొత్త ఆర్మీ సోల్జర్ అవతారంలో కనిపించనున్నాడు. అందుకోసం బాడీని మేకోవర్ చేయాల్సిన అవసరం కూడా ఉంటుందని.. తగినంత టైమ్ బాగా కేటాయించాల్సి వస్తుంది. కాబట్టి థాంక్యూ త్వరగా ముగించే ప్లాన్ చేసుకుంటున్నాడు. నిజానికి లాల్ సింగ్ చద్దా కోసం చైతూ నలభై రోజులు షూటింగ్ చేయాల్సి ఉంటుంది. అలాగే చైతూ పార్ట్ మొత్తం లడఖ్ లో షూట్ చేయబడతాయని సినీవర్గాలు చెబుతున్నాయి.హాలీవుడ్ హిట్ 'ఫారెస్ట్ గంప్' ఆధారంగా తెరకెక్కుతున్న ఈ భారీ చిత్రంతో నాగచైతన్య బాలీవుడ్ డెబ్యూ చేస్తుండటం విశేషం. ప్రస్తుతం నాగచైతన్య కెరీర్ ప్లాన్ చూసి అక్కినేని అభిమానులు ఖుషీ అవుతున్నారు. ఆ చిత్రం అయిన వెంటనే మళ్లీ డైరెక్టర్ విక్రమ్ కుమార్ తో అమెజాన్ ప్రైమ్ కోసం ఓ యాక్షన్ థ్రిల్లర్ వెబ్ సిరీస్ లో నటించనున్నాడు ఈ హీరో. ఈ విధంగా అటు బాలీవుడ్ డెబ్యూతో పాటు వెంటనే డిజిటల్ స్క్రీన్ పై అరంగేట్రం చేయనున్నాడు చైతూ. అయితే చైతూ తదుపరి తెలుగు సినిమా ఏంటి అనేది తెలియాల్సి ఉంది. ప్రస్తుతం థాంక్యూ పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో రాశిఖన్నా.. అవికా గోర్.. మాళవిక నాయర్ కీలకపాత్రలలో నటిస్తున్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**